www.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం 20- 12 - 2024 | సంపుటి : 21 | సంచిక : 92 | పేజీలు : 12 + 12వెల : రూ. 7/-

Published from Vijayawada Circulated from Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

# అఫ్ఘాన్‌లో ఘోరరోడ్డు ప్రమాదాలు

## రెండు ప్రమాదాల్లో 50మంది మృతి



కాబుల్: అఫ్ఘానిస్థాన్‌లోరెండు ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ప్రమాదాల్లో 50 మంది ప్రాణాలు కోల్పోయారు. 70 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. ఆగ్నేయ అగానిస్థాన్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగాయి. బుధవారం సాయంత్రం కాబుల్- కాందహార్‌లను కలిపే హైవేపై ఓ బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి. మరోవైపు.. అదే రహదారి దక్షిణ భాగంలో బస్సు, ట్రక్కు ఢీకొన్నాయి. ఈ రెండు ఘటనల్లో దాదాపు 50 మంది మృతి చెందారు. 76 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందినవారిలో మహిళలు, చిన్నారులు కూడా ఉండడం బాధాకరం. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఘాజ్నీ ప్రావిన్స్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఘాజ్నీ ప్రావిన్స్ గవర్నర్ ప్రతినిధి హాఫీజ్ ఒమర్ తాజాగా వెల్లడించారు.

## సహజీవనం తప్పుడు విధానం


- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- బ్రిటన్‌లో అతిపెద్ద సమస్య సహజీవనమే



న్యూఢిల్లీ: సహజీవనం తప్పుడు విధానమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఇది సమాజ సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. స్వలింగ సంపర్కుల వివాహాలతో.. సామాజిక వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన ఆరోపించారు. యూట్యూబ్ పోడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

2

## బంగాళాఖాతంలో బలపడ్డ అల్పపీడనం



- తీరంవైపు దూసుకొస్తున్న తుఫాన్
- తమిళనాడు, కోస్తాలకు భారీ వర్షసూచన
- శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు
- గంటకు గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో గాలులు

## అమెరికాలో బర్డ్ ఫ్లూ కలకలం.. కాలిఫోర్నియాలో ఎమర్జెన్సీ విధింపు

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియాలో బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1) కలకలం రేపుతోంది. 34 మంది ఈ వైరస్ బారిన పడడంతో రాష్ట్రంలో ఎమర్జెన్సీ విధిస్తూ గవర్నర్ గవిన్ న్యూసమ్ ఆదేశాలు జారీ చేశారు. వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యలు తీసుకుంటున్నట్టు గవర్నర్ తెలిపారు. దక్షిణ కాలిఫోర్నియాలోని ఓ డెయిరీ ఫాంలోని ఆవుల్లో ఈ వైరస్‌ను గుర్తించారు. వైరస్ ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి సంక్రమించిన ఆధారాలు లభించలేదని గవర్నర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ వైరస్ బారినపడిన వారందరూ ఆ డెయిరీ ఫాంలో పనిచేసినవారు, అక్కడికి దగ్గర్లో ఉన్నవారేనని వివరించారు. ఈ వైరస్ వల్ల సాధారణ ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది.

తుగ్లక్ నిర్ణయాలతో

## ఏపీకి రాజధాని లేకుండా పోయింది

ఏపీ మంత్రి పార్థసారథి



అమరావతి : వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాలనపై ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం తుగ్లక్ నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా పోయిందని విమర్శించారు. గురువారం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు.

➢ 2లో..

## సజ్జల భార్గవ్‌రెడ్డి క్వాష్ పిటిషన్లు

విచారణ ఫిబ్రవరికి వాయిదా



అమరావతి: వైకాపా నేత సజ్జల భార్గవ్‌రెడ్డి క్వాష్ పిటిషన్లపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. మొత్తం 4 పిటిషన్లపై వాదనలు సాగాయి. సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల నేపథ్యంలో భార్గవ్‌రెడ్డిపై కేసులు నమోదయ్యాయి.

➢ 2లో..

## రాజధాని నిర్మాణానికి


# 31 వేల కోట్లు సిద్ధం

### ప్రపంచ బ్యాంక్ నుంచి 15వేల కోట్లు మంజూరు

### జల్‌జీవన్ మిషన్ కింద స్వచ్ఛమైన తాగునీరు

అమరావతి, (నినాదం:

అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నూతన రాజధానిగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సమర్థతతో ముందుకెళ్లేందుకు సిద్ధమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇప్పటికే మొత్తం 31 వేల కోట్లు రూపాయలు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నిధులను ఉపయోగించి రాజధాని నిర్మాణం ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. "అమరావతికి దేశవ్యాప్తంగా పర్యాటక, వ్యాపార రంగాల్లో కీలకమైన స్థానం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రానికి విభిన్నమైన ప్రాధాన్యతను కలిగిన ఈ రాజధాని నిర్మాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చంద్రబాబు చెప్పారు.



**అగ్ర నగరంగా అమరావతి..**

ప్రస్తుతానికి ఆర్థిక సంబంధిత అనుమతులు, భూముల స్వాధీనం, నిర్మాణ రంగంలోని ఒప్పందాలు మొదలైన వాటిపై పరిశీలన జరుగుతోందన్నారు. అన్ని దిశలలో అభివృద్ధిని పర్యవేక్షిస్తూ, ఎటువంటి అంతరాయం లేకుండా పనులు కొనసాగిస్తామని ఆయన అన్నారు. అమరావతిని ఒక సమగ్ర నగరంగా, ఆధునిక వసతులతో కూడిన మల్టీ-డెమెన్షనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్లాన్ చేసినట్లు చెప్పారు. 31 వేల కోట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్న ఆయన, ఈ నిధుల కోసం ఎలాంటి ఆర్థిక సమస్యలు రావని స్పష్టం చేశారు.

**అధికారులకు ఆదేశాలు..**

ఈ క్రమంలోనే ప్రపంచ బ్యాంక్ నుంచి 15 వేల కోట్లు, హడ్కో నుంచి 16 వేల కోట్లు మంజూరు అయ్యాయని అధికారులు తెలిపారు. ప్రపంచ బ్యాంక్ ఈరోజు ఆమోదం తెలుపుతుందని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ నిర్మాణంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. దీంతోపాటు అసెంబ్లీ భవనాలు లోపల ఎలా ఉన్నాయనేది చూడాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజధాని నిర్మాణ పనులు మరో 30 రోజుల్లో ప్రారంభమవుతాయని అధికారులు స్పష్టం చేశారు.

- గ్రామకంఠ భూముల సర్వే ఫీజుల మినహాయింపు
- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం
- ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు

ముగిసిన కేబినెట్ సమావేశం..

## కీలక బిల్లులకు ఆమోదం!

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఆగ్రహం

20 ఇంజనీరింగ్ పనులకు రూ.8821 కోట్లు ఆమోదం

హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు..

కేఎఫ్ డబ్ల్యు నుంచి రూ.16 వేల కోట్లు రుణానికి ఆమోదం

➢ 2వ పేజిలో..

మహిళను అడ్డుపెట్టుకుని


## కోట్ల అవినీతికి.!

### ఫైబర్ నెట్లో కోట్ల అవినీతి..

- కీలకమైన ఫైల్స్ మాయం
- శాంతి సోదరి ఫైల్స్ అప్పగించారని అనుమానాలు

అమరావతి, (నినాదం)

ఏపీలో ఫైబర్ నెట్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలకమైన ఫైల్స్ మాయం కావడం సంచలనం రేపింది. అందులోని కీలక సమాచారాన్ని ఓ ఫైబర్ నెట్ ఉద్యోగి విజయసాయి రెడ్డికి అప్పగించారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ ఫైల్స్ అప్పగించిన ఉద్యోగి దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ శాంతి సోదరిగా గుర్తించారు. ఈకేసులో శాంతి సోదరిపై అనుమానాలు పెరిగాయి. వీరు దేవాదాయ శాఖలో పెద్ద మొత్తంలో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. విజయసాయి రెడ్డి ప్రణాళిక ప్రకారమే ఆమెను అడ్డు పెట్టుకుని ఫైబర్ నెట్లో కోట్ల అవినీతికి పాల్పడినట్లుగా తెలుస్తోంది.



➢ 2వ పేజిలో..

ఆయన్ను ఎందుకు

## అరెస్ట్ చేయలేదు

నటి జత్వానీ కేసులో హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

➢ 2వ పేజిలో..



ముంబై నటి జత్వానీని గత ప్రభుత్వంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులతో పాటు న్యాయవాది, ఏసీబీ, సీఐ వేధించిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. కానీ A2 నిందితుడు సీతారామాంజనేయులను మాత్రం అరెస్ట్ చేయలేదు. ఇదే విషయాన్ని మిగిలిన నిందితులు ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఏపీ హైకోర్టు జడ్జి ప్రస్తావించారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్

# రాజ్యాంగం

### చంద్రబాబు పాలనలో ప్రశ్నిస్తే కేసులు

### స్కామ్‌ల మీద స్కామ్‌లు జరుగుతున్నాయి

### వైసీపీ కార్యకర్తలెవరూ భయపడొద్దు


### వైసీపీ అధినేత జగన్ విమర్శలు

### పోరుబాటకు సిద్ధం కావాలని పిలుపు

**అమరావతి: చంద్రబాబు ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన విజన్ 420 కాదని మేనిఫెస్టోను ఎగ్గొట్టే ప్రణాళిక కాదని దుయ్యబట్టారు. విజన్ పేరుతో రంగురంగుల కథలు చేస్తున్నారని.. బాబు విజన్ చూస్తే ఆశ్చర్యమేస్తుందని ఎద్దేవా చేశారు.**

ఉమ్మడి అనంతరపురం జిల్లాలోని నేతలతో సమావేశంలో మాట్లాడిన జగన్ ఎన్డీఏ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు.ఆరు నెలలకే చంద్రబాబు ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో వ్యతిరేకత కనిపిస్తోందిని జగన్ వ్యాఖ్యానించారు. ఇంతటి వ్యతిరేకత గతంలో ఏ ప్రభుత్వం మీదా లేదన్నారు. అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం ధర్మం కాదనేది తన నమ్మకమని జగన్ ఉద్ఘాటించారు. ఐదేళ్ల మన పాలనలో చరిత్రలో ఎప్పుడూ జరగని మార్పులు చేశామని గుర్తు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్ లా భావించి అమలు చేశామన్నారు. ఆరు నెలల గడవకముందే చంద్రబాబు చెప్పిన మాటలు మోసాలై కంటికి కనిపిస్తున్నాయని జగన్ దుయ్యబట్టారు. "ఆరోజు నేను ఎన్నికల్లో చెప్పాను. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే అని. చంద్రబాబును నమ్మడం అంటే పులినోట్లో తలపెట్టడమే అని.. ఇవాళ ఆరు నెలల తిరక్క ముందే అదే కనిపిస్తోంది. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒకటే మాట వినిపిస్తోంది. జగన్ పలావు పెట్టాడు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నాడు. పలావు,

➢ 2వ పేజిలో..



## వైద్య రంగంలో అద్భుతం..

- క్యాన్సర్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి
- వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన రష్యా
- ఫ్రీగా పంపిణీ చేయాలని నిర్ణయం!
- జనవరిలో రష్యన్ మార్కెట్‌లో అందుబాటులోకి

గామాలియా: క్యాన్సర్ కేసులు ఇప్పుడు ప్రతిచోటా నమోదవుతున్నాయి. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స అందిస్తేనే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. అయితే ఇప్పుడు రష్యా క్యాన్సర్ కోసం ప్రత్యేక వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఎంఆర్ఎంఏ ఆధారితంగా రూపొందించిన వ్యాక్సిన్ క్యాన్సర్‌తో పోరాడుతుందని రష్యా చెబుతోంది. విశేషమేమిటంటే ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా ఇస్తామని రష్యా ప్రకటించింది.



## రాహుల్‌గాంధీపై కేసుకు నమోదు చేయనున్న బీజేపీ



న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బీజేపీ, ఇండియా కూటమి నేతల మధ్య తోపులాట జరిగిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఇవాళ ఇండియా కూటమి పార్లమెంట్ ఆవరణలో ప్రొటెస్ట్ నిర్వహించింది. ఆ సందర్భంలో రెండు వర్గాల మధ్య ఘర్షణాత్మక సంఘటనలు జరిగాయి. బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్ గాయపడ్డారు. మరో వైపు గాయపడ్డ బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లడారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో ఆ ఇద్దరూ చికిత్స పొందుతున్నారు.

➢ 2లో..

# యువత చేతిలోనే దేశ భవిష్యత్

## కష్టపడితేనే విజయం సొంతం

### విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు

### కుప్పం పర్యటనలో విద్యార్థులతో భువనేశ్వరి

కుప్పం: యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని.. కష్టపడితే విజయం సొంతమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. రెండోరోజు కుప్పం పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. అంతకుముందు కళాశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఐటీ రంగంలోనూ మహిళలు రాణించడం సంతోషకరమన్నారు. విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పారు. నిత్యం ప్రజల గురించి ఆలోచించే సీఎం చంద్రబాబే తనకు స్ఫూర్తి అన్నారు.

➢ 2వ పేజిలో..



## ఫెడ్ దెబ్బకు భారీగా పడిపోయిన రూపాయి

➢ 2లో..

డాలర్‌తో పోలిస్తే 85కు చేరిన విలువ

దిగుమతులు, విద్యార్థులపై తీవ్ర ప్రభావం

## పార్లమెంట్ వద్ద గందరగోళ వాతావరణం

- ఆందోళనలకు దిగిన కాంగ్రెస్, బిజెపి పక్షాలు
- తోపులాటలో బిజెపి ఎంపిలకు గాయాలు
- ఇద్దరినీ చికిత్స కోసం అస్పత్రికి తరలింపు
- కావాలనే అడ్డుకున్నారని రాహుల్ ఎదురుదాడి

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. పరస్పర తోపులాటల్లో బిజెపి ఎంపిలు ఇద్దరికి గాయాలయ్యాయి. ఆయనను హుటాహుటిని ఆస్పత్రికి తరలించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అటు అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం కూడా నిరసన చేపట్టారు. ఇరువర్గాల ఆందోళనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో భాజపాకు చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తోయడం వల్లే వీరు గాయపడ్డారనిభాజపా ఆరోపిస్తోంది.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, తెలంగాణ
20 డిసెంబర్ 2024
www.ninadam.co.in

# మహిళను అడ్డుపెట్టుకుని కోట్ల అవినీతికి పాల్పడ్డ విజయసాయిరెడ్డి.!

**అమరావతి, (నినాదం )**

ఏపీలో ఫైబర్ నెట్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలకమైన ఫైల్స్ మాయం కావడం సంచలనం రేపింది. అందులోని కీలక సమాచారాన్ని ఓ ఫైబర్ నెట్ ఉద్యోగి విజయసాయి రెడ్డికి అప్పగించారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ ఫైల్స్ అప్పగించిన ఉద్యోగి దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ శాంతి సోదరిగా గుర్తించారు. ఈ కేసులో శాంతి సోదరిపై అనుమానాలు పెరిగాయి. వీరు దేవాదాయశాఖలో పెద్ద మొత్తంలో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. విజయసాయి రెడ్డి ప్రణాళిక ప్రకారమే ఆమెను అడ్డు పెట్టుకుని ఫైబర్ నెట్లో కోట్ల అవినీతికి పాల్పడినట్లుగా తెలుస్తోంది.



**ఇప్పటికే ఏడుగురు**

దీంతో ఈ వ్యవహారంలో విజయసాయిరెడ్డి పాత్రపై దృష్టి పెట్టి అధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వం మారిన వెంటనే తాజాగా శాంతి సోదరిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఆ ఫైల్స్ ఎలా మాయమయ్యాయన్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కేసులో ఏసీబీ కోర్టు ఇప్పటికే ఏడుగురు నిందితుల ఆస్తులను అటాచ్ చేసేందుకు అనుమతి ఇచ్చింది. మొత్తం రూ. 114 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయాలని న్యాయస్థానం సానుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ఏ1 గా వేమూరి హరికృష్ణ, ఏ11 గా టెరా సాఫ్ట్ ఎండీ తుమ్మల గోపీచంద్, ప్రమీల, ఏ25గా చంద్రబాబు పేర్లు నమోదయ్యాయి.

**సీఐడీ అనుమతి**

వీరి కుటుంబ సభ్యుల ఆస్తులను కూడా అటాచ్ చేసేందుకు సీఐడీ అనుమతిని కోరింది. ఇదిలా ఉండగా ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పై సుప్రీం కోర్టు డిసెంబర్ 12న విచారణ చేపట్టింది. తదుపరి విచారణను జనవరి 17, 2025న జరగనుంది. ఈ కేసుకు సంబంధించిన అంశాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం, చంద్రబాబును ఇప్పటికే ఆదేశించింది.

## సహజీవనం తప్పుడు విధానం..

బ్రిటన్‌లో అతి పెద్ద సమస్య సహజీవనమే అని, పెళ్లిని వ్యతిరేకించడం పెద్ద సమస్యగా మారినట్లు ఇటీవల బ్రిటీష్ పార్లమెంట్ వెళ్లినప్పుడు అక్కడ తమకు తెలిసిందన్నారు. ఒకవేళ మీరు పెళ్లి చేసుకోకపోతే, అప్పుడు మీరెలా పిల్లల్ని కంటారని గడ్కరీ అడిగారు. ఒకవేళ పిల్లలు పుడితే, వాళ్ల భవిష్యత్తు ఏంటి ఆయన ప్రశ్నించారు. సమాజ వ్యవస్థకు వ్యతిరేకంగా వెళ్తే, అది ప్రజలపై ఎటువంటి ప్రభావం చూపుతుందని ప్రశ్నించినట్లు తెలిపారు. సమాజం తనంతటే తాను నిర్ణయాలు తీసుకుంటుందని, కానీ దేశంలో లింగ నిష్పత్తి సమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ 1500 మంది మహిళలు, 1000 మంది పురుషులు ఉంటే, అప్పుడు ఇద్దరు భార్యలకు పురుషుల అర్హులని ఆయన అన్నారు. ఆదర్శ భారత దేశంలో విడాకుల్ని బ్యాన్ చేయాలన్న దాన్ని ఆయన ఖండించారు. సహజీవనం మంచిది కాదన్నారు. సేమ్ సెక్స్ మ్యారేజ్‌ను వ్యతిరేకిస్తూ గత ఏడాది సుప్రీంకోర్టుకు చెందిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.

## ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేయలేదు

ఇద్దరు ఐపీఎస్‌లు కాంతిరాణా, విశాల్ గున్నీ, న్యాయవాది, ఏసీపీ, సీఐ తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా జడ్జి సంచలన ప్రశ్నలు సంధించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ2 మాజీ ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేయలేదు కదా అని నిలదీశారు. అనంతరం విచారణను కంటిన్యూ చేశారు.

**ముగిసిన కేబినెట్ సమావేశం..**

## కీలక బిల్లులకు ఆమోదం!

ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు కేబినెట్ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. నేడు 21 అంశాల ఎజెండాతో ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. రాష్ట్రంలో ఇటీవల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పీడీఎస్ రైస్ విదేశాలకు తరలిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్‌లో చర్చించారు. జల్ జీవన్ మిషన్‌కు సంబంధించి పనులను రద్దుచేసి తిరిగి మాడిఫై చేసిన 5 పనులకు రీ టెండర్లు పిలిచేందుకు, అగ్రిమెంట్ గడువు పొడిగించేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. అమరావతి రాజధానిలో మొత్తం 20 ఇంజనీరింగ్ పనులకు రూ.8821 కోట్లు పరిపాలన అనుమతులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పనులు చేపట్టేందుకు రూ.24316 కోట్లు మంజూరు ప్రతిపాదనకు ఆమోదించారు. 176 మంజూరు కేడర్ స్ట్రెంత్‌ను నూతనంగా ఏర్పాటైన 12 నగర పంచాయతీలు మున్సిపాలిటీలకు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఏపీ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు 14 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అమరావతి అభివృద్ధికి హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు కేఎఫ్ డబ్ల్యు నుంచి రూ.16 వేల కోట్లు రుణం తీసుకోవడానికి ఆమోదం లభించింది. ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 50 ఎకరాల 20 సెంట్లు భూమికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

## అల్పపడ్డ అల్పపీడనం

**విశాఖపట్టణం, :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కోస్తా తీరం వైపు దూసుకొస్తుంది. ఇది తీవ్ర అల్పపీడనంగా రూపాంతరం చెందింది. రాబోయే 24 గంటల్లో వాయవ్య దిశగా పయనిస్తూ ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాల వైపు వెళ్లనుంది. తర్వాత కోస్తా తీరం వెంబడి కదలనుంది. దీని ప్రభావంతో శుక్రవారం వరకు ఏపీ, తమిళనాడు రాష్టాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. శుక్రవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో తీరం వెంబడి గంటకు గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం పేర్కొంది.

## రాహుల్‌గాంధీపై కేసుకు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో బీజేపీ, ఇండియా కూటమి నేతల మధ్య తోపులాట జరిగిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఇవాళ ఇండియా కూటమి పార్లమెంట్ ఆవరణలో ప్రొటెస్ట్ నిర్వహించింది. ఆ సందర్భంలో రెండు వర్గాల మధ్య ఘర్షణాత్మక సంఘటనలు జరిగాయి. బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్ గాయపడ్డారు. మరో వైపు గాయపడ్డ బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లడారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో ఆ ఇద్దరూ చికిత్స పొందుతున్నారు.పార్లమెంట్‌లో వార్ సీన్ క్రియేట్ అయ్యింది. ఇండియా కూటమి, బీజేపీ ఎంపీల మధ్య తోపులాట జరిగింది. రాహుల్ గాంధీ నెట్టేస్తే, ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడ్డారు. ప్రస్తుతం ప్రతాప్ సారంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అంబేద్కర్ అంశంపై ఇవాళ పార్లమెంట్ ఆవరణలో ఇరు వర్గాలు నిరసన చేపట్టాయి. ఆ సమయంలో ఈ ఘటన జరిగింది. రాహుల్ గాంధీ తోసేస్తే.. గాయపడ్డ బీజేపీ ఎంపీలుపార్లమెంట్‌లో గందరగోళం నెలకొన్నది. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. గురువారం పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపీలు నిరసన చేపట్టారు. అయితే కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తూ.. బీజేపీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. పార్లమెంట్‌లోని మకర ద్వారం వద్ద .. ఇండియా కూటమి, బీజేపీ ఎంపీలు ఎదురుపడ్డారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. ఆ ఘర్షణలో బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్ గాయపడ్డారు.



# యువత చేతిలోనే దేశ భవిష్యత్

**కష్టపడితేనే విజయం సొంతం**

**విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు**

**కుప్పం పర్యటనలో విద్యార్థులతో భువనేశ్వరి**



**కుప్పం:** యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని.. కష్టపడితే విజయం సొంతమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. రెండోరోజు కుప్పం పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. అంతకుముందు కళాశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఐటీ రంగంలోనూ మహిళలు రాణించడం సంతోషకరమన్నారు. విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పారు. నిత్యం ప్రజల గురించి ఆలోచించే సీఎం చంద్రబాబే తనకు స్ఫూర్తి అన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ బాగుండాలని ఎంతో కష్టపడి చదివిస్తారని.. వారి నమ్మకాన్ని నిలబెట్టు కోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఒకప్పుడు మహిళలు ఇంటికే పరిమితమయ్యే వాళ్లని.. ఆ తర్వాత పరిస్థితులు మారాయని చెప్పారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ మహిళలు ముందున్నారన్నారు. విద్యార్థులను చూస్తుంటే తనకు కాలేజీ రోజులు గుర్తొస్తున్నాయని భువనేశ్వరి అన్నారు. 'నేనూ మీలాగే సరదాగా గడిపాను. కాలేజ్ డేస్ లైఫ్ అంతా గుర్తుంటా యి. నేను చదువుకుంటున్న సమయంలో 19 ఏళ్లకే పెళ్లి చేశారు. నాకు ఆ వయసులో ఏమీ తెలీదు. నా భర్త చంద్రబాబు నాపై నమ్మకంతో హెరిటేజ్ బాధ్యతలు అప్పగించారు. ఒక ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశాను. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు వెళ్లాలి. ఆటపాటలతో పాటు కెరీర్ పైనా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. విజయం ఊరికే రాదు.. కష్టపడకుండా వచ్చేది ఏదీ నిలబడదు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. డ్రగ్స్, గంజాయి యువతను నాశనం చేస్తోందన్నారు. 'వారి స్వలాభం కోసం చాలా మంది మిమ్మల్ని టెంప్ట్ చేస్తారు. చాలా జాగ్రత్తగా ఉండాలి. రోల్ మోడల్ పెట్టుకోవాలి' అని విద్యార్థులకు సూచించారు. ప్రతి పురుషుని సక్సెస్ మహిళతోనే ముడిపడి ఉంటుందన్నారు. 'కాలేజ్ డేస్ గుర్తుకు వస్తున్నాయి. ఆషామాషీగా వెళ్లి మీరందరూ చేసేదే నేను కూడా కాలేజ్‌లో చేసేదాన్ని. మిమ్మల్ని చూసి గర్వంగా ఉంది. ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అవర్ ఆంధ్రప్రదేశ్ లీడర్ ప్రతి ఒక్కరిలో ఉంటుంది. మీ హక్కుకోసం నడవాలి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీకోసం సంపాదిస్తున్నారు. అది ఈజీ కాదు. హార్డ్ వర్క్. ఏదీ ఫ్రీగా రాదు. కష్టంతోనే వస్తుంది. బాలికలకు పట్టుదల, ధైర్యం, మీమీద నమ్మకం ఉండాలి. పెళ్లి అయ్యేదాకా ఒకటి, తర్వాత మరొకటి. రాజకీయాల్లో బిజినెస్‌లో నన్ను నేను లాక్కుని ముందుకు వెళ్ళాను. మన ధైర్యం మనకుండాలి' అని వెల్లడించారు.'ముందు నందమూరి కుమార్తెను.. బాబు భార్య సెకండ్. ఒక మహిళగా నేనేమిటి అనేది నాకు తెలుసు. మనందరిలోనూ ఆ శక్తి ఉంది. ఫోకస్ పనిలోపెడితే ముందుకు వెళ్ళచ్చు. హౌస్ వైఫ్ ఉన్నప్పుడు హెరిటేజ్ చూసుకోమన్నారు. నాకే ఏమీ తెలియదు. ఎండీగా బాధ్యతలు ఇచ్చారు. అందరినీ ఒకటే అనుకున్నాను. జీవితాలు బాగుంటాయి. హార్డ్ వర్క్ మీద నమ్మకం పెట్టాలి. నాన్నకంటే గొప్పవాడివి కావాలి. చేయకపోతే నీ ఫ్యూచర్ ఆగుతుంది అని నా కుమారునికి చెప్పా. మీ భవిష్యత్తు నీ చేతిలో ఉంది. ఎవరూ రారు. బద్ధకం ఉంటే జీవితంలో ఎదగలేరు. మీరే ఫ్యూచర్ లీడర్స్, ఏ రంగంలోనైనా. డిసిప్లిన్ ముఖ్యం. నాకు డిసిప్లిన్ ఎక్కువ. స్ట్రిక్ట్‌నెస్ లేకపోతే నేను ముందుకు వెళ్లలేను. ఉద్యోగాలకు, ఆర్గనైజేషన్ టీమ్ వర్క్ ఉండాలి. అందరూ మనమే అంటేనే భవిష్యత్తు. సంతోషంగా కార్యక్రమం చేపట్టాలి. జీవితంలో టీచర్స్‌ను మరచిపోవద్దు. రెస్పెక్ట్ ఇవ్వాలి వారికి. అందరిలో ఉంటాయి తప్పులు. ఒక వేలు చూపిస్తే 4 వేళ్ళు మనల్ని చూపిస్తాయి. ఇవన్నీ ఎదుర్కొన్నాను నేను. వ్యాపారం, ఉద్యోగం అన్నింటిలోనూ ఆడపిల్ల దేనిలోనూ తక్కువకాదు. నా జీవితంలో చూస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ మిమ్మల్ని మీ కుటుంబం నుంచి దూరం చేస్తుంది. కుటుంబానికి ఇంపా÷-టఁ్గ÷న్స్ ఇవ్వండి. ఫోన్లు, సోషల్ మీడియా కుటుంబాలకు దూరం అవుతున్నారు' అని తెలిపారు. 'మా నాన్న నందమూరి తారకరామారావు పాలు అమ్మి వారి తల్లిదండ్రులకు హెల్ప్ చేసేవారు. అలానే చదువుకున్నారు. చంద్రబాబు కూడా కిలోమీటర్లు నడిచి, స్ట్రీట్ లైట్స్ కింద చదివేవారు. నా కొడుకు లోకేష్‌కు చెప్పాను, ఏదీ ఫ్రీగా రాదు అని. మొదట తల్లిదండ్రులు, గురువులు గౌరవించాలి. మిమ్మల్ని మోటివేట్ చేయాలని వచ్చాను. రాజకీయంగా కాదు. లోకేష్‌కు ఏది చెప్పానో అదే మీకు చెప్పాలని వచ్చాను. ఒక తల్లిగా వచ్చాను' విద్యార్థులను ఉద్దేశించి భువనేశ్వరి పేర్కొన్నారు. నా కుమారుడు లోకేశ్‌కి అదే చెప్పేదాన్ని అని అన్నారు. చంద్రబాబు ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారని.. ప్రజలకు సేవ చేయాలని ఆయన తపిస్తారని భువనేశ్వరి అన్నారు. ఇప్పుడు స్వర్ణాంధ్ర-విజన్ 2047 లక్ష్యంతో ముందుకెళుతున్నారని చెప్పారు. 'పేదరికం లేని సమాజమే చంద్రబాబు లక్ష్యం. ఆయన్ను సొంత బిడ్డగా భావిస్తూ ప్రేమాభిమానాలు చూపిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజల రుణం మేం తీర్చుకోలేం. రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మాటిస్తున్నాను' అని భువనేశ్వరి అన్నారు. అంతకుముందు శాంతిపురం మండలం శివపురం వద్ద సొంత ఇంటి నిర్మాణాన్ని భువనేశ్వరి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, పెద్ద ఎత్తున తెదేపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో అద్భుతం..

**వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన రష్యా**

రష్యా అభివృద్ధి చేసిన ఎంఆర్ఎంఏ ఆధారిత క్యాన్సర్ వ్యాక్సిన్ 2025 ప్రారంభంలో విడుదల కానుంది. క్యాన్సర్ వ్యాక్సిన్ విడుదలైన వెంటనే రష్యన్ మార్కెట్‌లో అందుబాటులో ఉంటుంది. రష్యాలోని రేడియల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ విషయంలో ఒక ముఖ్యమైన ప్రకటనను విడుదల చేసింది. వ్యాక్సిన్ ప్రయోగాత్మక దశలో క్యాన్సర్ కణితుల పెరుగుదలను నియంత్రించిందని తెలిపింది. ఈ వ్యాక్సిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులలో కణితులను నియంత్రించడంలో, వాటిని క్యాన్సర్ రహితంగా మార్చడంలో సహాయపడిందని గామాలియా నేషనల్ రీసెర్చ్ సెంటర్‌లోని ఎపిడెమియాలజీ, మైక్రోబయాలజీ డైరెక్టర్ అలెగ్జాండర్ గింట్స్‌బర్గ్ తెలిపారు. అనేక పరిశోధన సంస్థలు సమష్టి కృషితో క్యాన్సర్ వ్యాక్సిన్‌ను రూపొందించినట్లుగా శాస్త్రవేత్తలు ప్రకటించారు. క్లినికల్ ట్రయల్స్‌లో కణతి పెరుగుదలను అడ్డుకోవడంతో పాటు మెటాస్టాసిస్ అంటే వ్యాధికారక ఏజెంట్‌ను నిరోధించిందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ రోగికి క్యాన్సర్‌తో పోరాడే యాంటీబాడీని, రోగనిరోధక శక్తిని అందిస్తుంది. ఇది క్యాన్సర్ కణాలను నియంత్రించడంలో సహాయపడుతుంది. శరీరంలో క్యాన్సర్ కణాలతో పోరాడే ప్రతిరోధకాలను ఉత్పత్తి చేయడం ద్వారా, ఇది కణితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. గర్భాశయ క్యాన్సర్‌తో సహా అనేక ప్రాణాంతక, ప్రమాదకరమైన కణితి కణాలకు వ్యతిరేకంగా కూడా ఈ టీకా ప్రభావవంతంగా ఉంటుందని రష్యా అంటోంది. వైద్యరంగంలో క్యాన్సర్ వ్యాక్సిన్ అనేది ఒక ప్రధాన మైలురాయి కానుంది. అనేక దేశాలు క్యాన్సర్‌తో పోరాడటానికి టీకాలు, మందులను అభివృద్ధి చేస్తున్నాయి. అయితే అవి ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి.

రష్యా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రకటించడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. రష్యా ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక ప్రకటన చేశారు. క్యాన్సర్‌తో పోరాడే వ్యాక్సిన్‌ను రష్యా అభివృద్ధి చేసిందని చెప్పారు. ఈ వ్యాక్సిన్ ప్రయోగాత్మక దశలో మంచి ఫలితాలను చూపిందన్నారు. ఈ వ్యాక్సిన్‌ని అభివృద్ధి చేయడంలో దాదాపు విజయం సాధించామని తెలిపారు. ఇప్పుడు తాజాగా క్యాన్సర్ వ్యాక్సిన్ గురించి రష్యా ప్రకటన చేసింది.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

బిర్యానీ రెండూ పోయాయి. ఏమీ లేకుండా చంద్రబాబు రోడ్డు మీద నిలబెట్టాడు అన్న చర్చ నడుస్తోంది" అంటూ జగన్ కామెంట్స్ చేశారు. చంద్రబాబును ఎవరైనా ప్రశ్నిస్తే.. ఆ ప్రశ్నించే స్వరాన్ని అణగదొక్కుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కామ్‌ల మీద స్కామ్‌లు జరుగుతున్నాయని ఆరోపించారు. లిక్కర్, శాండ్ మాఫియాతో పాటు ప్రతి నియోజకవర్గంలోనూ పేకాట క్లబ్బులు నడుస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యమబాట పట్టడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ బిల్లుల మీద ఈనెల 27న ఆందోళనకు పిలుపునిచ్చామని జగన్ చెప్పారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు కూడా విడుదల చేయటం లేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు త్రైమాసికాలు



గడిచిపోయాయని.. అయినా డబ్బులు ఇవ్వటం లేదని ఆక్షేపించారు."ప్రతిపక్షంలో కష్టాలు, కేసులు సహజం. మనకూ తప్పనిసరిగా టైమ్ వస్తుంది. ప్రజలకు తోడుగా, ప్రజల తరపున వారికి అండగా గొంతు విప్పాల్సిన తరుణమిది. అప్పుడే మనం నాయకులుగా ఎదుగుతాం. నాయకులుగా ఎదగడానికి ఇదొక అవకాశం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు, నష్టాలు ఉంటాయి. కేసులు ఉంటాయి. జైల్లో కూడా పెడతారు. నేను మీ అందరికీ చెబుతున్నాను. కష్టాలు ఎల్లకాలం ఉండవు. కష్టం తర్వాత సుఖం ఉంటుంది. ఏ కష్టం ఎవరికి వచ్చినా నా వైపు చూడండి. నన్ను 16 నెలలు పెట్టారు. ప్రతిపక్షం ఉండదు. అడిగే వాడు ఉండదని నన్ను 16 నెలలు జైల్లో పెట్టారు. మరలా మన టైం వస్తుంది. జమిలి వస్తుందంటున్నారు. దేనికైనా మనం సిద్ధమే. ఎవ్వరూ, ఎక్కడా భయపడొద్దు. దేన్నైనా ఢీకొందాం. మీ అందరికీ జగన్మోహన్‌రెడ్డి, పార్టీ అండగా ఉంటుంది" అని జగన్ భరోసానిచ్చారు.

**ఫెడ్ దెబ్బకు భారీగా పడిపోయిన**

# రూపాయి

**ముంబయి, :** మరోమారు రూపాయి విలువ దారుణంవగా పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే 85కు చేరుకుంది. ఇంతగా పతనం కావడం ఇదే మొదటిసారి. దీంతో దిగుమతులు, విదేశాలకు వెళ్లే విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనుంది. మన దేశ కరెన్సీ రూపాయి విలువ భారీగా క్షీణించింది. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 85 స్థాయిని దాటింది. ఈ మార్కును దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించినప్పటికీ.. 2025లో వడ్డీ రేట్ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తామని పేర్కొనడం మన రూపాయితో పాటు, వర్ధమాన దేశాల కరెన్సీలపై ఒత్తిడి పెంచింది. ఈక్రమంలోనే బుధవారం నాటికి 84.94గా ఉన్న రూపాయి మారకం విలువ గురువారం ఉదయం 85.06 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. భౌగోళిక రాజకీయ పరిణామాలు, దేశీయ పరిణామాల కారణంగా గత కొంతకాలంగా రూపాయి ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దేశీయంగా వృద్ధి నెమ్మదించడం, వాణిజ్య లోటు పెరగడం, దేశీయంగా పెట్టుబడులు సన్నగిల్లడం వంటి కారణాలతో రూపాయి విలువ క్షీణించింది. అదే సమయంలో అమెరికా డాలరు మరింత బలపడడం, అక్కడ బాండ్ రాబడులు పెరగడం కూడా మరో కారణం. తాజాగా వడ్డీ రేట్ల కోత విషయంలో దూకుడు ఉండకపోవచ్చన్న ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలు రూపాయి విలువ పతనానికి దారితీసింది.

రూపాయితో పాటు కొరియన్ వోన్, మలేసియన్ రిగింట్స్, ఇండోనేషియా రూపాయి విలువలు కూడా స్వల్పంగా పతనమయ్యాయి. రూపాయి విలువ పతనమైతే ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడుతుంది. ఇక్కడినుంచి నగదును డాలర్లలోకి మారిస్తే.. మరిన్ని ఎక్కువ రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. మనం దిగుమతి చేసుకునే చమురుకు కూడా డాలర్లలోనే చెల్లింపులు చేస్తుంటాం. దీనివల్ల ఖజానాపై భారం పడుతుంది. అయితే, దేశీయ ఐటీ, ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తుంటాయి. వాటికి డాలర్లలో చెల్లింపులు జరుగుతుంటాయి. తద్వారా రూపాయి విలువ పతనంతో ఆ కంపెనీలకు లాభం చేకూరుతుంది.

## సజ్జల భార్గవ్‌రెడ్డి క్వాష్ పిటిషన్లు

**విచారణ ఫిబ్రవరికి వాయిదా**

**అమరావతి:** వైకాపా నేత సజ్జల భార్గవ్‌రెడ్డి క్వాష్ పిటిషన్లపై ఏపీ హైకోర్టులోవిచారణ జరిగింది. మొత్తం 4 పిటిషన్లపై వాదనలు సాగాయి. సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల నేపథ్యంలో భార్గవ్‌రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. దీంతో వాటిని క్వాష్ చేయాలని ఆయన పిటిషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. బీఎన్ఎస్ సెక్షన్ 35(3)కి అనుగుణంగా నోటీసులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది. వర్రా రవీందర్ రెడ్డితో భార్గవ్‌రెడ్డి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టించారనే ఆరోపణలున్నాయి. దీంతో భార్గవ్‌రెడ్డిపై పలుచోట్ల కేసులు నమోదయ్యాయి.

## అమిత్‌షాకు మంత్రిగా కొనసాగే హక్కు లేదు: సిపిఎం

**విజయవాడ, (నినాదం):** రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా, దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. భారత రాజ్యాంగం రూపశిల్పి అయిన డాక్టర్ అంబేద్కర్ గురించి అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. దీనితో ఆయన మనువాద దృక్పథాన్ని బయటపెట్టారని మండిపడ్డారు. అమిత్ షాకు హోంమంత్రిగా కొనసాగే హక్కు లేదని సిపిఐ(యం) భావిస్తున్నదని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులు, మేధావులు, లౌకిక, సామాజిక వాదులు సంఘాలు నిరసనలు తెలియజేయాలని కోరారు.

## వైకాపా తీరుతో ఫైబర్‌నెట్ దివాళా

**సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి వెల్లడి**

**అమరావతి,(నినాదం):** వైకాపా ప్రభుత్వం తీరుతో ఏపీ ఫైబర్‌నెట్ (ఏపీఎస్ఎఫ్ఎల్) ప్రస్తుతం దివాళా అంచున ఉందని ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. దర్శకుడు రాంగోపాల్ వర్మకు అప్పటి అధికారులు అక్రమంగా రూ.2.10కోట్లు చెల్లించారని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో జీవీ రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు ఇంటర్నెట్ సేవలు అందించడమే లక్ష్యంగా 2016లో సీఎం చంద్రబాబు దీన్ని ప్రారంభించారన్నారు. 2019 నాటికి 24వేల కి.మీ మేర కేబుల్ వేసి 10లక్షల కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. ఇవాళ ఆ సంఖ్య 5లక్షలకు పడిపోయిందన్నారు. 'ఏపీ ఫైబర్‌నెట్ సంస్థలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. గత ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్లను వేధింపులకు గురిచేసింది. అప్పటి ఎండీ మధుసూదన్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. వైకాపా నేతల అక్రమాలు బయటపడకుండా కీలక దస్త్రాలు మార్చేశారు. కీలక డాక్యుమెంట్లను వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డికి ఓ మహిళా ఉద్యోగి చేరవేశారు. మెను ఉద్యోగం నుంచి తొలగించాం. అనవసర ఖర్చులు తగ్గించుకుని నిధులు సమీకరించుకుంటాం. 'వ్యూహం' సినిమాను ÷బైర్‌నెట్‌లో టెలికాస్ట్ చేసి అక్రమంగా దర్శకుడు రాంగోపాల్‌వర్మ (ఆర్జీవీ)కి చెల్లింపులు చేశారు. ఎక్కడా లేనివిధంగా అప్పటి అధికారులు వ్యవహరించారు. ఆ సినిమాకు 18 లక్షల వ్యూస్ వస్తే రూ.2లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.2.10 కోట్లు ఇచ్చారు' అని జీవీ రెడ్డి వివరించారు.

## 'పెనుగొండ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

**ఆత్మీయ శుభాకాంక్షలు**



**గుంటూరు:** ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. దీపిక అభ్యుదయ 'వ్యాస సంపుటి'కి గాను ఆయన ఈ అవార్డు పొందారు. గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్న పెనుగొండ 1985-90 మధ్యకాలంలో గుంటూరులో విశాలాంధ్ర విలేకరిగా పనిచేస్తుండగా తాను ఆంధ్రపత్రికలో పనిచేస్తుండే వాడినని, నాటి నుంచి కూడా తనకు ఎంతో సాన్నిహిత్యం వుందని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతి రావు తెలిపారు. ఈ సందర్భంగా తన ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. పెనుగొండ వారు తెలుగు సాహిత్యంలో చేసిన కృషికి గాను అజో-విభో కందాళం వారి 'జీవన సాఫల్య పురస్కారం' లభించింది. గతంలో అధికార భాషా సంఘం వారి తెలుగు భాషా పురస్కారం (2003)లో, ప్రజాకవి సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం (2003) లభించాయి. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 2023లో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా పెనుగొండ గుర్తింపు పొందారు.

1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. ఆయన తొలి గ్రంథం "అనేక" 2004లో ప్రచురితం కాగా, విదిత 2014లో ప్రచురణయింది. దీపిక 2021లో ప్రచురించారు. దీపికలో పూర్తి సాధికారత కనిపిస్తుంది. 'దీపిక'లో దర్శించిన విషయాలపై వొరప్రసాద్ (సాహితీ స్రవంతి) ఇలా వ్యాఖ్యానించారు. "తొలి, మలితరం తెలుగు కథలు" సంకలనం గురించి దీపిక వివరంగా చర్చించింది. తప్పులకు రుజువులు చూపిస్తూ సరిచేసిన వ్యాసం విలువైన సమాచారం ఇస్తుంది. పివి నరసింహారావు రాసిన 'గొల్ల రామవ్వ' కథను హరితకాంశాల నేపథ్యంలో విశ్లేషించారు. గురజాడ సాహిత్యం - పర్గీకరణలు రాయలును యుగకర్త అనడములోని సాహిత్య కులము బయటపెట్టారు. "వైతాళికులు" సంకలనం వివాదంలో విస్మరణకు గురైన కవితా సంకలనం "కల్పన"ను పాఠకులకు పరిచయం చేశారు. పరిశోధకులకు ఈ దీపిక నిజంగానే కరదీపిక.

## తుగ్లక్ నిర్ణయాలతో ఏపీకి రాజధాని లేకుండా పోయింది

వైసీపీ అసంబద్ధ నిర్ణయాలతో జరిగిన నష్టాన్ని వివరిస్తూ విమర్శలు చేశారు. రాజధాని అమరావతిని కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో అంతర్జాతీయస్థాయిలో తెలుగు ప్రజలు గర్వపడే విధంగా పూర్తి చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. దాంట్లో భాగంగానే ప్రపంచబ్యాంక్ , హడ్కో, కేడబ్ల్యూఎఫ్ నిధులతో రూ. 33,137 కోట్లతో 45 ఇంజినీరింగ్ పనులు చేపట్టేందుకు ఏపీసీఆర్‌డీఏకు కేబినెట్ అనుమతి ఇచ్చిందన్నారు.

గత జగన్ రెడ్డి ప్రభుత్వం, స్వచ్ఛమైన త్రాగు నీటి కోసం, కేంద్రం అందించిన జల్ జీవన్ మిషన్ని నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. నాడు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష నుంచి లక్షన్నర కోట్లు ఈ పథకం కింద నిధులు కేంద్రం నుంచి తీసుకోగా జగన్ సర్కార్ కేవలం రూ. 27 వేలు కోట్లు మాత్రమే తీసుకుని వాటిలో కేవలం రూ. 4వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని వెల్లడించారు.

475 జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

475 జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అందించే పథకానికి ఆమోదం తెలిపినట్టు వివరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 1.41 లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతుందని తెలిపారు. క్లీన్ ఎనర్జీ కోసం ఎన్టీపీసీ ద్వారా పెట్టే పెట్టుబడుల కోసం జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులతో విద్యుదుత్పత్తి యూనిట్ల స్థాపనకు నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే : కేటీఆర్



**హైదరాబాద్ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పురపాలక, జీహెచ్ఎంసీ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుల్లో ఈ అంశం లేదని చెప్పారు. మూడు బిల్లులకు బీఆర్ఎస్ తరఫున సవరణలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. తమ సవరణలను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే సభలో డివిజన్‌కు కూడా పట్టుబడుతామని స్పష్టం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. నవంబర్‌లోగా కులగణన పూర్తి చేస్తామని అధికారపార్టీ చెప్పిందన్నారు. కులగణనపై తేల్చకుండా చట్ట సవరణకు అసెంబ్లీలో ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లు ప్రస్తావించకపోవడం బీసీలను మోసం చేయడమేనని ఆరోపించారు.

# అక్కడ ఏం జరుగుతోంది..?




## తెరపైకి "పలిమెల" భూముల వివాదం రాష్ట్రంలో హట్ టాపిక్‌గా మారిన వైనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల శివార్లలోని వందలాది ఎకరాలు ఉన్న భూస్వాములు అప్పటి నక్సల్స్ కారణంగా ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోయారు. ఈక్రమంలో ఆ భూములను స్థానిక రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆనాడు భూములను ఇక్కడి నిరుపేదలకు అప్పగించి వెళ్లిపోగా అప్పటి నుండి ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. అయితే రికార్డుల్లో మాత్రం ఈ భూములకు పట్టాదారులుగా పెత్తందార్లు మారుతూ వస్తున్నారు. తాజాగా దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి ఈ భూములను విక్రయించడం. ఈ విషయం బయటకు పొక్కడంతో పలిమెల, బొడాయి, పంకెన, అప్పాజిపేటకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

### అధికారుల అత్యుత్సాహం..

సాధారణంగా ఎవరిదైనా భూమి రిజిస్ట్రేషన్ చేయాలంటే సంబంధిత అధికారులు,కార్యాయాల చుట్టూ కాళ్ల చెప్పులు అరిగేలా తిరుగాలే. అధికారులు సైతం అనేక కొర్రీలు పెడుతుంటారు. కానీ పలిమెల వ్యవహారంలో మాత్రం రెవెన్యూ అధికారులు అత్యుత్సాహం చూపినట్లు తెలుస్తోంది. పలిమెల భూముల పట్టాదారుల పేర్లను మార్చేందుకు అధికారులు చకాచక పావులు కదిపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ మారుమూల మండలంలో ఒక్కరోజు 102 ఎకరాల భూమికి యాజమాన్య హక్కులు మార్చేశారంటే అధికారుల ఎంత ఉత్సాహంగా పనిచేశారో అర్థం అవుతుంది. కానీ ఈ భూములు ఎందుకు ఇంత త్వరగా రిజిస్ట్రేషన్ చేశారన్నదే అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.

### అసలు కమాలుద్దీన్ ఎవరు...?

పలిమెల భూముల వ్యవహారంలో కమాలుద్దీన్ పేరు మారుమ్రోగుతోంది. అసలు కమాలుద్దీన్ ఎవరు ఆయనకు భూములకు సంబంధం ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే పలిమెలకు చెందిన ఖాజా దబీరుద్దీన్ (పాషాదొర) పట్టేదారుగా ఉన్న ఖాజా నసీరుద్దీన్ కు చెందిన వందలాది ఎకరాల భూములను 1980వ దశాబ్దం నుండి ఈ ప్రాంతానికి చెందిన దళిత, గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ భూములకు సంబంధించిన అంశం చాలా కాలంగా మరుగున పడి పోగా 2008లో పట్టాదారుల వారసులుగా చెలామణి అయిన వారు రంగంలోకి వచ్చారు. కమాలోద్దీన్ అనే వ్యక్తి ద్వారా ఈ భూములకు సంబంధించిన క్రయవిక్రయాలు జరిగినట్టుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే కమాలోద్దీన్ అనే వ్యక్తి అసలు పట్టాదారులకు వారసుడేనా..అన్న విషయాన్ని తేల్చాల్సిన అవసరం ఉంది. సంబంధం లేని వ్యక్తి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టయితే వాటిని రద్దు చేసే అవకాశం ఉంటుంది. ఒక వేళ కమాలోద్దీన్ అసలు వారసుడే అయితే ఆయన ఒక్కడే ఉన్నగా మిగతా వారు ఎవరూ లేరా అన్న వివరాలను కూడా సేకరించినట్టయితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

### మొదట ముడిసరుకు గురించి తెలిసిందెవరికి...

తూర్పు అటవీ ప్రాంతంలో అనేక ఖనిజ సంపదలు విస్తారంగా ఉన్నాయనే విషయం అందరికి తెలుసు...కానీ పలిమెల ప్రాంత భూముల్లో సిమెంట్‌కు ఉత్పత్తి అయ్యే ముడి సరుకు ఉందని మొదట గుర్తించింది ఎవరనే ప్రశ్న అందరిని వెంటాడుతోంది. ఏఏ ప్రాంతాల్లో వనరులు ఉన్నాయన్న విషయాలను వివరించే రికార్డులు తప్ప ఇటీవల కాలంలో మాత్రం ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా పరీక్షలు జరిగినట్లు ఆనవాళ్లు లేవు. ఇక్కడి భూముల్లో సిమెంట్ ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు నిలువలు ఉన్నాయన్న విషయం తెలుసుకుని డెక్కన్ సిమెంట్ కంపెనీకి భూములు అమ్మాలనే ఆలోచన ఎవరు చేసిండ్లనే చర్చ జోరుగా సాగుతోంది. సహజ వనరులు ఉన్న విషయాన్ని గుర్తించింది ఎవరూ..ఈ ప్రాంతంపై సర్వే ఏమైనా చేశారా..కంపెనీ ప్రతినిధులు కూడా పరీక్షలు చేయకుండానే ఈ భూములు కొంటారా అన్న అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

### సున్నపు రాయి నిల్వలు ఉన్న మాట వాస్తవమే...

పలిమెల ప్రాంతంలో సున్నపు రాయి నిల్వలు పెద్ద ఎత్తున ఉన్నాయన్న విషయం వాస్తవమే...ఈ విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాతే ఏ కంపెనీ అయినా భూములు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తాయి. కానీ అందుకు బిన్నంగా జరుగుతోంది. ఎక్కడా పరిశోదనలు జరుగలేదు...అధ్యయనాలు జరుగలేదు..కానీ దక్కన్ సిమెంట్ కంపెనీకి మాత్రం వందల ఎకరాల్లో భూములు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగడం వెనుక ఎవరున్నారనే ప్రశ్న మెదలుతోంది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డోలామైట్, లాటరైట్ వంటి ఖనిజాలు కూడా ఉన్నాయని పరిశోధకులు ఇప్పటికే తెల్చిన విషయం తెలిసిందే. కానీ ఖనిజ సంపదపై పూర్తి స్థాయిలో స్టడీ చేసిన తరువాతే కంపెనీలు అక్కడి భూములు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తాయి. కానీ డెక్కన్ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు నేరుగా వచ్చి పలిమెల భూములు కొనడానికి వెనక జరిగిన తతంగం ఏంటన్నదే మిస్టరీగా మారింది.

### మంత్రి హస్తముందనే ఆరోపణలతో మరింత ఆసక్తి...

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండదండలతోనే పలిమెల భూముల వ్యవహారం జరిగిందని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఆసక్తి నెలకొంది. మంత్రి తమ్ముని కోసమే భూములను బదలాయించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపణలు చేశారు. మూడు తరాలకు చెందిన దళిత, గిరిజన రైతులు ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తే వారిని నడిరోడ్డుపై వేసే విధంగా చేశారని, తమ్ముడికి సిమెంట్ కంపెనీలో వాటా కోసం రాత్రికి రాత్రే రహస్య ప్రదేశంలో రెవెన్యూ అధికారులు భూములు కంపెనీకి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తున్నారు. ఎస్సీ ఎస్టీలకు చెందిన వందల ఎకరాల భూములు సిమెంట్ కంపెనీకి అప్పగించాలని చూస్తున్నారని ప్రతిపక్షాల ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి.

### తహశీల్దార్ సస్పెండ్‌తో...

పలిమెల ప్రాంతంలోని ఎస్సీ ఎస్టీలకు చెందిన వందలాది ఎకరాల భూములను తహశీల్దార్ రహస్యంగా దక్కన్ సిమెంట్ కంపెనీ పేరున రిజిస్ట్రేషన్ చేశాడనే ఆరోపణల నేపథ్యంలో సదరు తహశీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో మరిన్ని అనుమానాలను వ్యక్తం అవుతున్నాయి. పలిమెల భూముల వ్యవహారంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సమాచారంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పలిమెల మండల కేంద్రానికి చేరుకుని కబ్జాలో ఉన్న రైతుల వివరాలను సేకరించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్‌కు అందించిన నివేదికతో తహశీల్దార్‌ను సస్పెండ్ చేశారు. అయితే తహశీల్దార్ సస్పెండ్ చేయడంతో అక్కడ దక్కన్ కంపెనీకి రహస్యంగా భూముల రిజిస్ట్రేషన్ జరిగిందనే మాట వాస్తవమేననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



# అంబేద్కర్ కేంద్రంగా రాజకీయ దుమారం

**సంపాదకీయం**

గ్రవర్ణ పార్టీగా, రాజ్యంగం అంటే గౌరవం లేని పార్టీగా ముద్రపడిన భారతీయ జనతా పార్టీ రంగు ఎట్టకేలకు బయటపెట్టుకుంది. పార్లమెంట్ సాక్షిగా సాక్షాత్తు హోం మంత్రి అమిత్ షా ఆరెస్సెస్ ప్రతినిధిగా మారిపోయారు. అంటూ ప్రతిపక్షాలు మాటల తూటాలను సంధిస్తున్నాయి. అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. రాజ్యాంగ వజ్రోత్సవాలపై రాజ్యసభలో రెండు రోజుల చర్చకు మంగళవారం ఆయన బదులిచ్చారు. ఆ సందర్భంగా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ అంబేద్కర్ ప్రస్తావన తెచ్చారు. 'అంబేద్కర్, అంబేద్కర్ అనడం వాళ్లకు ఇప్పుడో ఫ్యాషనైపోయింది. అన్నిసార్లు దైవనామ స్మరణ చేస్తే కనీసం ఏడు జన్మల దాకా స్వర్గమన్నా దక్కేది' అంటూ ఎద్దేవా చేశారు. అంబేద్కర్‌ను పదేపదే అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ది. ఇప్పుడు అంబేద్కర్ పేరును ఓటుబ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. అంటూ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. అయితే అమిత్ షా చేసిన 'అంబేద్కర్ ` దైవ నామస్మరణ' పోలిక తీవ్ర విమర్శలకు దారితీసింది. బుధవారం జాతీయ రాజకీయాలు వాటిచుట్టే తిరిగాయి. దీనిని కాంగ్రెస్ అవకాశంగా మార్చుకుంది. రాజ్యాంగ నిర్మాతనే గాక దేశంలోని దళితులందరినీ అమిత్ షా తీవ్రంగా అవమానించారని కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ మండిపడ్డాయి. ఆయన తక్షణం బహిరంగంగానూ, పార్లమెంటులోనూ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఓ అడుగు ముందుకేసి, షా తక్షణం రాజీనామా చేయాల్సిందే. లేదంటే ప్రధాని మోదీయే ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పట్ల మోడీ ఏమాత్రం గౌరవమున్నా బుధవారం అర్ధరాత్రిలోపు ఈ పని చేయాలి అంటూ అల్టిమేటం జారీ చేశారు. అయితే, అందుకు భిన్నంగా ప్రధాని మోడీ తన ట్వీట్లలో హోం మంత్రిని వెనకేసుకొచ్చారు. ఎప్పటిలాగే కాంగ్రెస్ మీద మండిపడ్డారు. బీజేపీ అహంభావ ధోరణికి, అంబేద్కర్‌పై వారికున్న ద్వేషానికి అమిత్ షా వ్యాఖ్యలు అద్దం పట్టాయని ఖర్గే మండిపడ్డారు. అంబేద్కర్‌కు, రాజ్యాంగానికి ఏమాత్రం గౌరవం ఇవ్వొద్దని మనుస్మృతి సిద్ధాంతాన్ని ఆచరించే బీజేపీ, ఆరెస్సెస్ నిర్ణయించుకున్నాయని ఆరోపించారు. మనుస్మృతికి చోటివ్వలేదంటూ రాజ్యాంగ ప్రతిని, అంబేద్కర్ దిష్టి బొమ్మలను తగలబెట్టిన చరిత్ర బీజేపీది అని ఆరోపించారు. ఉభయ సభలు వాయిదా పడ్డాక పార్లమెంటు ప్రాంగణంలో విపక్షాలన్నీ అమిత్ షా వ్యాఖ్యలపై ఆందోళనకు దిగాయి. నేతలంతా నల్లజెండాలు, ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకతో పాటు తృణమూల్, ఆప్, ఆర్జేడీ, ఎస్పీ, శివసేన (యూబీటీ), వామపక్షాల నేతలు పాల్గొన్నారు. అమిత్ షా ఇలాగే మాట్లాడితే దేశమంతటా అగ్గి రాజుకుంటుందని ఖర్గే హెచ్చరించారు. కాగా, అమిషా వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం దేశవ్యాప్తంగా నిరసనలకు దిగింది కాంగ్రెస్. అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లోని తమ పార్టీ ప్రధాన కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టింది. మరోవైపు, తన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు వక్రీకరించాయని అమిత్ షా వివరణ ఇచ్చారు. అయితే ఇలాంటి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ చేసి ఉంటే బీజేపీ నేతలు ఏ రేంజ్ లో రాజకీయ దుమారం లేపేవారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ రాహుల్ గాంధీ ఏ మాట్లాడినా అందులోంచి ఏదో ఒక మాటను పట్టుకుని నానా యాగీ చేసిన చరిత్ర బీజేపీ కి లేదా? ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించిందే అనుకుందాం..ఇలాంటి రాజకీయాలు మొదలు పెట్టిందే బీజేపే అంటే కాదనగలమా? కనుక, ఏ రాజకీయ పార్టీ అయినా ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టే అవకాశం కోసమే చూస్తుంది. ఇప్పుడు విపక్షాలు అదే పని చేస్తున్నాయి. అంబేద్కర్ విషయంలో గతంలో నెహ్రూ హయాంలో ఏం జరిగిందో ఈ తరానికి తెలియకపోవచ్చు. కానీ ప్రజలకు ఇప్పుడు జరుగుతున్నది మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని బీజేపీ పెద్దలు గుర్తించాలి. ఏదేమైనా సున్నితమైన అంశంపై మాట్లాడే సందర్భంలో కేంద్రం హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తోంది. సాధారణంగా విపక్షాల విమర్శలు, ఆరోపణలను ప్రధానీ, హోం మంత్రి ఏ మాత్రం పట్టించుకోరనే భావన ప్రజల్లో నెలకొని ఉంది. మణిపూర్ అల్లర్ల పైనే ప్రధాని చాలా కాలం వరకు స్పందించలేదు. మొక్కుడి స్టేట్ మెంట్ ఇచ్చి సరిపెట్టారు. అలాంటి మోడీ కూడా ఇప్పుడు స్పందించాల్సి వచ్చింది. ఇక అమిత్ షా ఏకంగా మీడియా ముందుకు వచ్చి స్వయంగా వివరణ ఇవ్వాల్సి వచ్చింది. దీనిని బట్టి విషయం ఎంత సున్నితమైనదో అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే విషయం రాజ్యాంగ రచయిత కు సంబంధించినది కాబట్టి. దేశంలోని వర్గాలు పూజ్యనీయులుగా చూడాల్సిన వ్యక్తి. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఇదే ఎజెండా. అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారని చెప్పి విమర్శలు చేయడం. దళిత నేతలతో ఉద్యమాలు చేయించడం. అయినా అమిత్ షా వంటి నేతకు అంబేద్కర్ గురించి వ్యతిరేకంగా మాట్లాడితే రాజకీయం ఎలా ఉంటుందో తెలియదా.. తెలిసి కూడా మాట్లాడతారా?.

## 'స్వర్ణాంధ్ర విజన్`2047' డాక్యుమెంట్`

# అరచేతిలో వైకుంఠమా?




త వారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్`2047' డాక్యుమెంట్ .. నియో లిబరల్ విధానాలు మరింత త్వరిత గతి అమలుకు రోడ్ మ్యాప్. అడ్డూ అదుపు లేని కార్పొరేట్ దోపిడీకి రెడ్ కార్పెట్. వికసిత భారత్ నిర్మాణం కోసం కేంద్రంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన 'విజన్`2047'లో భాగంగా రాష్ట్రంలోనూ తీసుకొచ్చామని చంద్రబాబు, కూటమి నేతలు ప్రకటించారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రతిపాదించిన విజన్‌లో అణువణువూ మతతత్వ`కార్పొరేట్ విధానాల కలబోత కాగా.. అందులో భాగమే తమ 'కల' అంటున్నారు చంద్రబాబు. ప్రజలందరికీ సంపద, ఆరోగ్యం, సంతోషం అందించడమే లక్ష్యమని చెబుతున్నారు. పేదరికం లేని సమాజం, ఉపాధి` ఉద్యోగ కల్పన, నైపుణ్యం`మానవ వనరుల అభివృద్ధి, ఇత్యాది పది సూత్రాలు తమ విజన్‌కు ప్రాతిపదికగా పేర్కొన్నారు. 2047 నాటికి అందరికీ అక్షరాస్యత, 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 42 వేల డాలర్ల తలసరి ఆదాయం, 60 శాతానికి పట్టణ జనాభా, రెండు శాతానికి నిరుద్యోగిత రేటు తగ్గింపు, 85 సంవత్సరాల సగటు ఆయు ప్రమాణం, 450 బిలియన్ డాలర్ల ఎగుమతులు లక్ష్యాలుగా ప్రకటించారు. ఈ 'కలలు' ఆకర్షణీయంగానే కనిపిస్తున్నప్పటికీ వాటి సాధనకు ఎంచుకున్న విధానాలే సదరు కలలను కల్లలు చేస్తాయి.రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పి`4 విధానాన్ని తారకమంత్రంగా జపిస్తోంది. ఇప్పటి వరకు మూడు 'పి' లు? పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) వాడుకలో ఉంది. కొత్తగా పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపిపి)? నాలుగు 'పి' ల ఫార్ములా తెర మీదికి తెచ్చారు. అందులో భాగంగానే విజన్ డాక్యుమెంట్ విడుదల వేదికపై నుంచి ఎక్కడ పరిశ్రమ వస్తే అక్కడి రైతులు భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చినట్లున్నారు. దానర్థం కార్పొరేట్లు పరిశ్రమలు, ప్రాజెక్టులు పెడతారు. అందుకు కావాల్సిన భూములను రైతులు త్యజించాలన్నమాట. రైతుల భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్ర పి`4 సిద్ధాంతం వెనుక దాగుంది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోనిటైజేషన్ పైప్‌లైన్ అంది. అడవులను, నదులను, సముద్రాలను, చివరికి జాతీయ రహదారుల, రైల్వే ట్రాక్‌ల వెంబడి భూములను సైతం కార్పొరేట్లకు అప్పగిస్తోంది. చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ అందుకు భిన్నమైంది కాదు. ఆర్థిక హబ్‌లు, హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్, రెండు మెగా పోర్టులు, రీసైక్లింగ్ క్లస్టర్, నౌకా నిర్మాణం, టూరిజం ప్రాజెక్టులు, ఎ.ఐ, డ్రోన్లు.. ఇవన్నీ ప్రైవేట్ కార్పొరేట్ల ప్రాపకం కోసమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాస్తా స్పీడ్ ఆఫ్ బిజినెస్‌గా మారిందీ అందుకే. ఇప్పటికే జగన్ ప్రభుత్వం రాష్టాన్ని అదానీ ప్రదేశ్‌గా మార్చింది. పోర్టులు, విద్యుత్, సకలం అదానీకి సమర్పించారు. జగన్ ప్రభుత్వం రాష్టాన్ని విధ్వంసం చేసిందన్న కూటమి తాను కూడా అదే బాటలో పయనిస్తోందనడానికి సెకితో సౌర విద్యుత్ ఒప్పందం కొనసాగింపు మంచి ఉదాహరణ.

# సంక్షోభాల్లో కూరుకుపోయిన అభాగ్యులకు సంఘీభావం తెలియజేద్దాం !

**(20 డిసెంబర్ "అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం" సందర్భంగా)**

ప్రపంచ మానవాళి పలు సమస్యల సంక్షోభాల్లో కూరుకుపోతున్నది. పేదరికం కోరలు చాస్తున్నది. అసమానతలు రాజ్యమేలుతున్నాయి. వివక్షలు ఒళ్లు విరుస్తున్నాయి. అనారోగ్యాలు ఆగం చేస్తున్నాయి. ఆకలి కేకలు ప్రాణాలు తీస్తున్నాయి. యుద్ధాలు మారణహోమాలా సృష్టిస్తున్నాయి. కన్నీటి వరదలు పారుతున్నాయి. అంతర్గత సంక్షోభాలు అంతుచూస్తున్నాయి. సామాజిక న్యాయం సత్తుబడుతున్నది. ఆహార అభద్రత నరకం చూపిస్తున్నది. సమస్యలు ప్రపంచ మానవాళిని తరుముతున్నాయి. కుల మత విభేదాల కాళ్లు కంపుకొడుతున్నది. మానవత్వం మంటగలుస్తున్నది.




ప్రపంచవ్యాప్త 8.2 బిలియన్ల ప్రజలు పలు సమస్యలతో సతమతం అవుతున్న వేళ మానవీయ కోణాన్ని తట్టి లేపుతూ, అభాగ్యుల శ్రేయస్సుకు సంఘీభావం తెలుపవలసిన సందర్భం వచ్చిందని గుర్తు చేయడానికి ప్రతి ఏట 20 డిసెంబర్ రోజుల ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం (ఇంటర్నేషనల్ హూమన్ సాలిడారిటీ డే)" పాటించుట 2005 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచమే ఓ అద్భుత వైవిధ్యత నెలవు. సంస్కృతి వారసత్వాలకు అదో ఆదరువు. ప్రపంచ దేశాలు, ప్రాంతాలు విలక్షణ జీవన విధానాలతో కొనసాగుతున్నాయి. మానవ సమాజం మానవీయతను ప్రదర్శిస్తూ పేదల పాలిట దైవాలుగా నిలిచి, ఆకలిని అంతం చేయడానికి తమ సహాయ సంఘీభావాలను తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైనదని ఐరాస భావిస్తున్నది.

అంతర్జాతీయమానవ సంఘీభావ దినం వేదికగా భిన్నత్వ ప్రపంచాన్ని ఏకత్వ భావనతో చూడడం, ప్రభుత్వాలు మానవ సమస్యల పరిష్కారాలకు తగు చర్యలు తీసుకోవడం, మానవ ఏకీకరణ ప్రాధాన్యాలను అవగాహన పర్చడం, ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సంఘీభావ ప్రదర్శనలు చేయడం, పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయడం, సామాజిక న్యాయాలను కల్పించడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. పరమత సహనం, పరహిత సద్గుణాలు నేటి తక్షణ అవసరం అని ప్రచారం చేయాల్సిన శుభ సందర్భం. దయ, కరుణ భావాలను పెంచి పోషించడం, విశ్వ మానవ ఐక్యతకు సంఘీభావాన్ని ప్రకటించడం కొనసాగాలి.

విభేదాలు తాత్కాలికమైనవని, చర్చలతో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని, ప్రపంచ శాంతి శాశ్వతమని, ప్రజా శ్రేయస్సే మన నినాదం కావాలని కోరుకుంటేనే రేపటి తరం సుఖశాంతులతో మనగలుగుతుందని తెలుసుకొని మానవత్వ పంట పండించడానికి సహాయ, సలహా, సంఘీభావాలను తెలియజేద్దాం. ప్రపంచ మానవ ఏకీకరణకు సంఘీభావ విత్తులు నాటుదాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# అమరావతిని త్వరగా నిర్మించే ప్రణాళిక




- మొత్తం 31 వేల కోట్లతో నిర్మాణ పనులు
- ప్రపంచ బ్యాంక్ నుంచి 15వేల కోట్లు మంజూరు
- జల్‌జీవన్ మిషన్ కింద స్వచ్ఛమైన తాగునీరు
- గ్రామకంఠ భూముల సర్వేకు ఫీజుల మినహాయింపు
- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం
- ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు

**అమరావతి:**అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నూతన రాజధానిగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సమర్థతతో ముందుకెళ్లేందుకు సిద్ధమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇప్పటికే మొత్తం 31 వేల కోట్లు రూపాయలు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నిధులను ఉపయోగించి రాజధాని నిర్మాణం ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. 'అమరావతికి దేశవ్యాప్తంగా పర్యాటక, వ్యాపార రంగాల్లో కీలకమైన స్థానం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రానికి విభిన్నమైన ప్రాధాన్యతను కలిగిన ఈ రాజధాని నిర్మాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతానికి ఆర్థిక సంబంధిత అనుమ తులు, భూముల స్వాధీనం, నిర్మాణ రంగంలోని ఒప్పందాలు మొదలైన వాటిపై పరిశీలన జరుగు తోందన్నారు. అన్ని దిశలలో అభివృద్ధిని పర్యవేక్షిస్తూ, ఎటువంటి అంతరాయం లేకుండా పనులు కొనసాగిస్తామని ఆయన అన్నారు. అమరావతిని ఒక సమగ్ర నగరంగా, ఆధునిక వసతులతో కూడిన మల్టీ-డెమెన్షనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్లాన్ చేసినట్లు చెప్పారు. 31 వేల కోట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్న ఆయన, ఈ నిధుల కోసం ఎలాంటి ఆర్థిక సమస్యలు రావని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ప్రపంచ బ్యాంక్ నుంచి 15 వేల కోట్లు, హడ్కో నుంచి 16 వేల కోట్లు మంజూరు అయ్యాయని అధికారులు తెలిపారు. ప్రపంచ బ్యాంక్ దీనికిఆమోదం తెలుపుతుందని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ నిర్మాణంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. దీంతోపాటు అసెంబ్లీ భవనాలు లోపల ఎలా ఉన్నాయనేది చూడాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజధాని నిర్మాణ పనులు మరో 30 రోజుల్లో ప్రారంభమవుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్రపడింది.. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి కొలుసు పార్థసారథి.. కేబినెట్ నిర్ణయాలను వివరించారు.. జల్ జీవన్ మిషన్ పథకం అమలు జరగకపోవడం గత ప్రభుత్వం చేసిన నష్టానికి ఉదాహరణగా పేర్కొన్న ఆయన.. లక్ష నుంచి లక్షన్నరకి ప్రతిపాదనలు పంపించాయి కేరళ లాంటి చిన్న రాష్ట్రాలు సైతం జలజీవన్ మిషన్ కి.. కానీ, పరిశుభ్రమైన నీటికి లక్షలాది ప్రజలు దూరమయ్యారని తెలిపారు.. అయితే, 25 శాతం కంటే తక్కువ పనులు 11,400 కోట్లు.. వాటికి రీటెండరింగ్ జరుగుతుంది.. వాటికి కేబినెట్ అనుమతి మంజూరు చేసిందన్నారు.. డోన్, ఉత్థానం, పులివెందులలో పనులు ప్రారంభించడానికి అనుమతులు ఇచ్చింది.. స్థిరమైన నీటి వనరులు వినియోగం ద్వారా త్రాగునీటి వసతి ఇవ్వాలన్నది జల్ జీవన్ మిషన్ ఉద్దేశం అన్నారు..ఇక, ఇప్పటి వరకూ డోలాయమానంలో ఉన్న అమరావతికి వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నిధులు ఇచ్చాయి.. 45 ఇంజనీరింగ్ పనులు 33,137 కోట్లతో పూర్తి చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వెల్లడించారు.. గ్రామకంఠ భూముల సర్వే, రికార్డింగ్ లో 48,899 సబ్ డివిజన్ చేయడానికి అర్జీలు వచ్చాయి.. వాటికి ఫీజు రాయితీ ఇస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నా యన.. వరదల్లో ముంపుకు గురైనవారి రుణాలపై యూజర్ ఛార్జీలు ఎత్తివేయడానికి, రుణాలు రీషెడ్యూల్ చేయడానికి మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.. మార్క్ ఫెడ్ కు 1000 కోట్ల అదనపు రుణాన్ని పొందేందుకు ఆమోదం లభించింది.. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులకు రీడెండరింగ్ కు కేబినెట్ ఆమోదించింది.. హంద్రీనీవా కింద పుంగనూరు బ్రాంచి కెనాల్ కు పాత రేట్ల ప్రకారమే చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ తో ఔ౦ఖఅ జాయింట్ వెంచర్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది.. 1.06 లక్షల ఉపాధి అవకాశాలు ఈ జాయింట్ వెంచర్ ద్వారా వస్తాయన్నారు.. మరోవైపు.. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించనున్నాం..

475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, కేజీబీవీల్లో ఈ పథకం అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు మంత్రి పార్థసారథి.. ఈ పథకాన్ని పునరుద్ధరించడం వల్ల 1.4 లక్షల మంది విద్యార్థులు ఉపయోగపడుతుందన్నారు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లకు పుస్తకాల సరఫరాకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.. ప్రభుత్వ కాలేజీలలో సైతం జేఈఈ వంటి పరీక్షలకు కావాల్సి ఏర్పాటు చేస్తాం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కేబినేట్‌లో ప్రధానంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి నిర్మాణం కోసం ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. హడ్కో ద్వారా రూ.11వేల కోట్లు రుణం తీసుకునేందుకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ ద్వారా రూ.5వేల కోట్ల రుణానికి ఆమోదం అభించింది. 45 పనులకు రూ.33వేల కోట్ల నిధులు ఖర్చు చేసేందుకు సీఆర్‌డీఏకు అనుమతి ఇచ్చారు. బుడమేరు, పది జిల్లాల్లోని వరద ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్‌కు ఆమోదం ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కోసం మార్క్‌ఫెడ్ ద్వారా రూ.వెయ్యి కోట్ల రుణానికి ఆమోదం ఇచ్చారు. పోలవరం ఎడమ కాల్వ రీటెండర్‌కు అనుమతి ఇచ్చారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు ఆమోదం తెలిపింది. క్లీన్ ఎనర్జీ కోసం ఎన్‌టీపీసీ ద్వారా పెట్టుబడుల కోసం జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తారు. రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులతో విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌ల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 475 జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించేందుకు ఆమోదం. 1.41 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతుందని మంత్రి పార్థసారథి వివరించారు.

## తుగ్లక్ నిర్ణయాలతో ఏపీకి రాజధాని లేకుండా పోయింది : ఏపీ మంత్రి పార్థసారథి



**అమరావతి :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాలనపై ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం తుగ్లక్ నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా పోయిందని విమర్శించారు. గురువారం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. వైసీపీ అసంబద్ధ నిర్ణయాలతో జరిగిన నష్టాన్ని వివరిస్తూ విమర్శలు చేశారు. రాజధాని అమరావతిని కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో అంతర్జాతీయస్థాయిలో తెలుగు ప్రజలు గర్వపడే విధంగా పూర్తి చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. దాంట్లో భాగంగానే ప్రపంచబ్యాంక్ , హడ్కో, కేడబ్ల్యూఎఫ్ నిధులతో రూ. 33,137 కోట్లతో 45 ఇంజినీరింగ్ పనులు చేపట్టేందుకు ఏపీసీఆర్‌డీఏకు కేబినెట్ అనుమతి ఇచ్చిందన్నారు. గత జగన్ రెడ్డి ప్రభుత్వం, స్వచ్ఛమైన త్రాగు నీటి కోసం, కేంద్రం అందించిన జల్ జీవన్ మిషన్ ని నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. నాడు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష నుంచి లక్షన్నర కోట్లు ఈ పథకం కింద నిధులు కేంద్రం నుంచి తీసుకోగా జగన్ సర్కార్ కేవలం రూ. 27 వేలు కోట్లు మాత్రమే తీసుకుని వాటిలో కేవలం రూ. 4వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని వెల్లడించారు.


**IN THE COURT OF HON'BLE IV ADDL. SENIOR CIVIL JUDGE R.R. DISTRICT AT: L.B.NAGAR**

E.P NO: 34 OF 2024

**BETWEEN:**

M/S. Jindal Steels Tubes Ltd

AND

P. Kistaiah and 2 Others ...JDRS

**NOTICE**

To,

1.P. Kistaiah S/o. Istari, age 66yrs R/o. H.No.148, Gandipet village and mandal, R.R District.

2.P. Anil S/o. Sahadev, age36yrs R/o. H.No.149, Gandipet village and mandal, R.R District.

Please take this notice, that the DHR filed the above case against JDRS, requesting this Hon'ble court to issue warrant under order 21 rule 35 against JDRS to hand over the vacant physical possession by removing the structures erected in the Suit Schedule Property and hand over the suit property to the Decree Holder, and the said matter is posted on 24-12-2024 for your appearance i.e., JDR No.1 and 2, as this Hon'ble Court ordered to take Notice through paper publication as you avoided the Notices served prior. Therefore you are hereby directed to appear in person or through Counsel on 24-12-2024 at 10:30 A.M. before the Hon'ble Court, failing which the matter will be decided in your absence on merits.

**\\ BY ORDERS OF THE COURT//**

M. JAIPAL REDDY, P. PRIYANKA
ADVOCATES
CELL: 9000207001



MANAPPURAM HOME FINANCE LTD.

**మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**

**ఇంతకముందు మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

CIN: U65923K12010PIC039179, యూనిట్ నెం. 301 -315, 3వ అంతస్తు, ఎ వింగ్, 'కనకియా వాల్ స్ట్రీట్, అంధేరి-కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400093.

**స్వాధీనత ప్రకటన**
**(స్థిరాస్తి కొరకు)**

అది అలావుండగా, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("MAHOFIN") వారి అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ *(యాక్ట్), 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోపుగా నోటీసు నందు తెలియజేయబడిన మొత్తం మరియు దానిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీతలను మరియు సహ-రుణగ్రహీతలను** కోరుతూ **డిమాండ్ నోటీసు** జారీ చేసినారు. రుణగ్రహీత బకాయి మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 9తో చదువబడు సదరు *(యాక్ట్) యొక్క సెక్షన్ 13(4) క్రింద ఆతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇచ్చట దిగువ వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనము** చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేస్తూ నోటీసు ఇవ్వడమైనది. సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైననూ సంబంధిత ఆస్తుల ఒక్కొక్కటి కొరకు దిగువ తెలిపిన విధముగా **మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జికి లోబడి యుండునని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.


| క్ర. సం. | రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత పేరు /రుణ ఖాతా నెంబర్ / బ్రాంచ్ | కల్పించబడిన ఇంటరెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డ్ ఆస్తుల వివరణ | డిమాండ్ నోటీస్ పంపిన తేది & రావలసిన బకాయి మొత్తం | స్వాధీనత తేది |
|---|---|---|---|---|
| 1. | బండెల నాగమణి, బండెల సాయిలు, నలుక నాంపల్లి/NLAP0111001012/ తిరుమల టాకీస్ క్రాస్ రోడ్ | తెలంగాణ, పిన్: 502248, మెదక్ జిల్లా, శంకరంపేట్ పి.ఓ. శంకరంపేట్ మండలం, శంకరంపేట్ గ్రామం, రెస్టాఫ్ ఏరియా, 215 చ.గ.ల విస్తీర్ణము గల సర్వే నెం. 347/Lu. తూర్పు: కిష్టమ్మ యొక్క ప్లాటు, పడమర: ముంద్రాతి స్వామి యొక్క ప్లాటు, దక్షిణం: జానీమియా మరియు ఇతరుల యొక్క ఖాళీ స్థలం,ఉత్తరము: 15-0 వెడల్పు రోడ్డు. | 10-09-2024 & Rs.512752/- | 17-12-2024 |

తేది: 20.12.2024, ప్రదేశము: తెలంగాణ — సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్


# బంగాళాఖాతంలో బలపడ్డ అల్పపీడనం

### తీరంవైపు దూసుకుని వస్తున్న తుఫాన్ - తమిళనాడు, కోస్తాలకు భారీ వర్షసూచన

**విశాఖపట్టణం:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కోస్తా తీరం వైపు దూసుకొస్తుంది. ఇది తీవ్ర అల్ప పీడనంగా రూపాంతరం చెందింది. రాబోయే 24 గంటల్లో వాయవ్య దిశగా పయనిస్తూ ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాల వైపు వెళ్లనుంది. తర్వాత కోస్తా తీరం వెంబడి కదలనుంది. దీని ప్రభావంతో శుక్రవారం వరకు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. విజయనగరం, విశాఖ పట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. శుక్రవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో తీరం వెంబడి గంటకు గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం పేర్కొంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. మార్పుల ప్రభావం రాష్ట్రంలో తిరుపతి, బాపట్ల, ఏలూరు, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో బుధవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలు జిల్లాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. వాతావరణ పరిస్థితుల మేరకు నవంబరు, డిసెంబరులో ఏర్పడే అల్పపీడనాలు తమిళనాడు సమీపంలో తీరం దాటతాయని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రాంతంలో తీరం దాటాల్సిన అల్పపీడనాలు తమిళనాడులో, తమిళనాడులో తీరం దాటాల్సిన అల్పపీడనాలు మన రాష్ట్రంలో దాటుతున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరున అండమాన్ సమీపంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని ఐరోపాకు చెందిన మోడల్ సూచిస్తోంది.బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని.. ముఖ్యంగా కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం



పేర్కొంది.. నైరుతి బంగాళాఖాతం దాన్ని అనుకోని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని.. రానున్న 24 గంటల్లో వాయువ్య దిశగా పయనిస్తోందని.. దీని ప్రభావంతో నెల్లూరు నుంచి విజయనగరం జిల్లా వరకు కోస్తా అంతటా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.. ఈ సమయంలో తీరం వెంబడి 35- 45 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది.. ఇక, కళింగపట్నం నుంచి మచిలీపట్నం వరకు అన్ని పోర్టులకు 3వ నంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది.. ఈ సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.. మరో 48 గంటలపాటు ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## 'పెనుగొండ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

**గుంటూరు, (నినాదం న్యూస్):** ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. దీపిక అభ్యుదయ 'వ్యాస సంపుటి'కి గాను ఆయన ఈ అవార్డు పొందారు. గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్న పెనుగొండ 1985-90 మధ్యకాలంలో గుంటూరులో విశాలాంధ్ర విలేకరిగా పనిచేస్తుండగా తాను ఆంధ్రపత్రికలో పనిచేస్తుండే వాడినని, నాటి నుంచి కూడా తనకు ఎంతో సాన్నిహిత్యం వుందని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా తన ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. పెనుగొండ వారు తెలుగు సాహిత్యంలో చేసిన కృషికి గాను అజో-విభో కందాళం వారి 'జీవన సాఫల్య పురస్కారం' లభించింది. గతంలో అధికార భాషా సంఘం వారి తెలుగు భాషా పురస్కారం (2003)లో, ప్రజాకవి సుంకర సత్యనారా యణ స్మారక పురస్కారం (2003) లభించాయి. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 2023లో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా పెనుగొండ గుర్తింపు పొందారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు.



ఆయన తొలి గ్రంథం "అనేక" 2004లో ప్రచురితం కాగా, విదిత 2014లో ప్రచురణయింది. దీపిక 2021లో ప్రచురించారు. దీపికలో పూర్తి సాధికారత కనిపిస్తుంది. 'దీపిక'లో దర్శించిన విషయాలపై వీరప్రసాద్ (సాహితీ స్రవంతి) ఇలా వ్యాఖ్యానించారు. "తొలి, మలితరం తెలుగు కథలు" సంకలనం గురించి దీపిక వివరంగా చర్చించింది. తప్పులకు రుజువులు చూపిస్తూ సరిచేసిన వ్యాసం విలువైన సమాచారం ఇస్తుంది. పివి నరసింహారావు రాసిన 'గొల్ల రామవ్వ' కథను హరితకాంశాల నేపథ్యంలో విశ్లేషించారు. గురజాడ సాహిత్యం- పర్గీకరణలు రాయలును యుగకర్త అనడములోని సాహిత్య కులము బయటపెట్టారు. "వైతాళికులు" సంకలనం వివాదంలో విస్మరణకు గురైన కవితా సంకలనం "కల్పన"ను పాఠకులకు పరిచయం చేశారు. పరిశోధకులకు ఈ దీపిక నిజంగానే కరదీపిక.

## ఒక్కోసారి మంచి మాట్లాడినా వక్రీకరిస్తారు

### కేబినేట్‌లో మంత్రులతో సిఎం చిట్‌చాట్



**అమరావతి:**ఏపీ కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం ఢిల్లీ పరిణామాలు, తాజా అంశాలపై చర్చ జరిగింది. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మంత్రు లతో సీఎం మాట్లాడుతూ.. సున్నితమైన అంశాలపై ఒక్కోసారి మంచి ఉద్దేశంతో మాట్లా డినా, వాటిని వక్రీకరించే వారుంటారని చంద్రబాబు తెలిపారు. ఇదే సమయంలో గతంలో వ్యవసాయం దండగ అని తాను అనని మాటను అన్నట్లు తప్పుడు ప్రచారం చేసిన విషయాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. ఇవాళ అంబేద్కర్ విషయమై ఢిల్లీలో జరుగుతున్న వ్యవహారం ఈ తరహాలోనే ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్‌కు తగిన గౌరవం లభించలేదని, అంబే ద్కర్ ఎన్నికల్లో ఓడిపోయింది కాంగ్రెస్ హయాంలోనే అనే విషయాన్ని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. వీపీ సింగ్ హయాంలో పార్లమెంట్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని, అంబేద్కర్‌కు ఎవరి ద్వారా గుర్తింపు వచ్చిందనే తదితర అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపోతే పార్లమెంటులో జరిగిన పరిణామాలు ఫోన్‌లో మంత్రి లోకేష్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వివరించారు. సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు కొనసాగించాలని నిర్ణయించారు. శాఖల్లో దస్త్రాలు పేరుకు పోతుండటం, మంత్రులు సక్రమంగా సాంకేతికత వినియగించక పోవటంపై సీఎం చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. మంత్రుల పనితీరును తాను ప్రత్యేకంగా మానిటర్ చేస్తున్నానని ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రి వద్దకు ఏదైనా దస్త్రం వచ్చి ఎంత సేపు పెండింగ్‌లో ఉంటోందో ప్రతీదీ తనకు తెలుసని ఈ సంద ర్భంగా చెప్పారు. ఇంచార్జ్ మంత్రులు ఇంకా కొందరు జిల్లాలకు వెళ్లకపోవటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు పాలసీలు లోతుగా చదువుకోవాలని హితవుపలికారు. కొంతమంది అసలు అధ్యయనం చేయడంలేదన్నారు. స్థానిక సంస్థల ఛైర్మన్‌ల పదవీకాలం నాలుగు ఏళ్ల నుంచి రెండున్నర సంవత్సరాలకు తగ్గించాలని వచ్చిన ప్రతిపాదనను కేబినెట్ తిరస్కరించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి 79 మున్సిపాలిటీలో సమయం అయిపోతుందని మంత్రి నారాయణ చెప్పారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- చంద్రబాబు పాలనలో ప్రశ్నిస్తే కేసులు
- స్కామ్‌ల మీద స్కామ్‌లు జరుగుతున్నాయి
- వైసీపీ కార్యకర్తలెవరూ భయపడొద్దు
- వైసీపీ అధినేత జగన్ విమర్శలు
- పోరుబాటకు సిద్ధం కావాలని పిలుపు



**అమరావతి:** చంద్రబాబు ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ విమర్శలు గుప్పించారు. ప్రభు త్వం ప్రకటించిన విజన్ 420 కాదని మేనిఫె స్టోను ఎగ్గొట్టే ప్రణాళిక కాదని దుయ్యబట్టారు. విజన్ పేరుతో రంగురంగుల కథలు చేస్తున్నా రని.. బాబు విజన్ చూస్తే ఆశ్చర్యమేస్తుందని ఎద్దేవా చేశారు. ఉమ్మడి అనంతరపురం జిల్లాలోని నేతలతో సమావేశంలో మాట్లాడిన జగన్ ఎన్డీఏ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు.ఆరు నెలలకే చంద్రబాబు ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో వ్యతిరేకత కనిపిస్తోందిని జగన్ వ్యాఖ్యానించారు. ఇంతటి వ్యతిరేకత గతంలో ఏ ప్రభుత్వం మీదా లేదన్నారు. అబద్దాలు చెప్పడం, మోసం చేయడం ధర్మం కాదనేది తన నమ్మకమని జగన్ ఉద్ఘాటించారు. ఐదేళ్ల మన పాలనలో చరిత్రలో ఎప్పుడూ జరగని మార్పులు చేశామని గుర్తు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్ లా భావించి అమలు చేశామన్నారు. ఆరు నెలల గడవకముందే చంద్రబాబు చెప్పిన మాటలు మోసాలై కంటికి కనిపిస్తున్నాయని జగన్ దుయ్యబట్టారు. "ఆరోజు నేను ఎన్నికల్లో చెప్పాను. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే అని. చంద్రబాబును నమ్మడం అంటే పులినోట్లో తలపెట్టడమే అని.. ఇవాళ ఆరు నెలల తిరక్క ముందే అదే కనిపిస్తోంది. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒకటే మాట వినిపిస్తోంది. జగన్ పలావు పెట్టాడు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నాడు. పలావు, బిర్యానీ రెండూ పోయాయి. ఏమీ లేకుండా చంద్రబాబు రోడ్డు మీద నిలబెట్టాడు అన్న చర్చ నడుస్తోంది" అంటూ జగన్ కామెంట్స్ చేశారు. చంద్రబాబును ఎవరైనా ప్రశ్నిస్తే.. ఆ ప్రశ్నించే స్వరాన్ని అణగ దొక్కుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కామ్‌ల మీద స్కామ్‌లు జరుగుతున్నాయని ఆరోపించారు. లిక్కర్, శాండ్ మాఫియాతో పాటు ప్రతి నియోజకవర్గంలోనూ పేకాట క్లబ్బులు నడుస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యమబాట పట్టడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ బిల్లుల మీద ఈనెల 27న ఆందోళనకు పిలుపునిచ్చామని జగన్ చెప్పారు. ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు కూడా విడుదల చేయటం లేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు త్రైమాసికాలు గడిచిపోయాయని.. అయినా డబ్బులు ఇవ్వటం లేదని ఆక్షేపించారు. "ప్రతిపక్షంలో కష్టాలు, కేసులు సహజం. మనకూ తప్పనిసరిగా టైమ్ వస్తుంది. ప్రజలకు తోడుగా, ప్రజల తరపున వారికి అండగా గొంతు విప్పాల్సిన తరుణమిది. అప్పుడే మనం నాయకులుగా ఎదుగుతాం. నాయకులుగా ఎదగడానికి ఇదొక అవకాశం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు, నష్టాలు ఉంటాయి. కేసులు ఉంటాయి. జైల్లో కూడా పెడతారు. నేను మీ అందరికీ చెబుతున్నాను. కష్టాలు ఎల్లకాలం ఉండవు. కష్టం తర్వాత సుఖం ఉంటుంది. ఏ కష్టం ఎవరికి వచ్చినా నా వైపు చూడండి. నన్ను 16 నెలలు పెట్టారు. ప్రతిపక్షం ఉండదు. అడిగే వాడు ఉండదని నన్ను 16 నెలలు జైల్లో పెట్టారు. మరలా మన టైం వస్తుంది. జమిలి వస్తుందంటున్నారు. దేనికైనా మనం సిద్ధమే. ఎవ్వరూ, ఎక్కడా భయపడొద్దు. దేన్నైనా ఢీకొందాం. మీ అందరికీ జగన్మోహన్‌రెడ్డి, పార్టీ అండగా ఉంటుంది" అని జగన్ భరోసానిచ్చారు.

# టీటీడీ కీలక నిర్ణయం..

### తిరుమల విజన్-2047 రూపకల్పనకు ఏజెన్సీల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానం

**తిరుమల :** టీటీడీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. స్వర్ణాంధ్రా విజన్-2047కు అనుగుణంగా తిరుమలలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టి సారించే ప్రణాళికతో ' తిరుమల విజన్- 2047' ను ప్రారంభించింది. ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రఖ్యాత ఏజెన్సీలను ఆహ్వానిస్తూ ప్రతిపాదనల కోసం ఆర్‌ఎఫ్‌పీని విడుదల చేసింది. తిరుమల అభివృద్ధిలో సాంప్రదాయాన్ని, ఆధునికతతో సమతుల్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించిన మేరకు టీటీడీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. తిరుమల విజన్ 2047 లక్ష్యాలను చేరుకునేందుకు, పట్టణ ప్రణాళిక, ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, వారసత్వ పరిరక్షణ, పర్యావరణ నిర్వహణపై ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఏజెన్సీల నుంచి ప్రతిపాదనలను టీటీడీ ఆహ్వానిస్తోందని ఒక ప్రకటనలో వెల్లడించారు. తిరుమల అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయడం, ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జోనల్ అభివృద్ధి ప్రణాళికను సవరించడం, తిరుమల పవిత్రతను కాపాడుతూ భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి భవిష్య వ్యూహాలను రూపొందించడం లాంటి ప్రణాళిక రూపకల్పన కోసం కన్సల్టెంట్‌ను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. మూడు వారాల్లోగా ఆసక్తి గల ఏజెన్సీల నుంచి ప్రతిపాదనలను కోరుతున్నట్లు టీటీడీ వివరించారు. ఇలాంటి భారీస్థాయి పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఏజెన్సీలకు ముందస్తు అనుభవం తప్పనిసరిగా ఉండాలని సూచించింది.

## సేవ చేయాలనే ఆలోచన గొప్పది

### - జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** సేవ చేయాలనే ఆలోచన చాలా గొప్పదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ అన్నారు. సీఏఆర్డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన బట్టల పంపిణీ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషాతో కలిసి ఆయన పాల్గొని విద్యార్థులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కంటే విద్యాదానం గొప్పదని, సీఏఆర్డీఎస్ సంస్థ ద్వారా గ్రామాల్లో పేద పిల్లల భవిష్యత్ గురించి ఆలోచన చేయడం అభినందనీయమ న్నారు. గ్రామాల్లోని పేద పిల్లలు చెడు మార్గాల వైపు వెళ్లకుండా వారికి ఆటా పాటల రూపంలో విద్యాబోధన చేయడం గొప్ప విషయమని అన్నారు. సంస్థ సేవలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి సంస్థకు అవసరమైన సహాకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పుష్పలత, శ్రీపతి రాజు, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అభినయ్ చారి, జిల్లా నాయకులు లక్కీ, భిక్షపతి, రామనాకర్‌తో పాటు పాఠశాల హెచ్ఎం, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి టోర్నమెంట్‌కు హాజరు కావాలి

**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ, మండల స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ 2024 క్రీడల పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి టోర్నమెంట్‌కు హాజరు కావాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి తుల రవి తెలి పారు. గ్రామస్థాయి, మండల స్థాయిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులతో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో నిర్వహించవలసిన క్రీడలను స్వయంగా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసిన క్రీడాకారులు ఆయా తేదీల్లో క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసిన క్రీడాకారులు టీఎస్ డబుల్ ఆర్ ఎస్ జాకారంలో హాజరయ్యే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు గమనించాలన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన అయిన క్రీడాకారులను స్టేట్ లెవెల్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 20, 21న వాలీబాల్, బేస్బాల్, నెట్ బాల్, స్విమ్మింగ్, బాస్కెట్బాల్, వాలీబాల్, 22న రెజ్లింగ్, ఫుట్బాల్, సైక్లింగ్, జూడో బిల్లెట్స్, అండ్ స్మోకర్స్ నిర్వహించడం జరుగుతుందని, ఆయా తేదీల ప్రకారం క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

## అంబేద్కర్‌ను అవమానించిన మంత్రి రాజీనామా చేయాలే



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** పార్లమెంట్ నిండు సభలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జి పసులోది ముఖేష్ అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర హెూం శాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని లేకుంటే అంబేద్కర్ విగ్రహం ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లేకుంటే అమిత్ షా ఎక్కడ అని రాజ్యాంగ ప్రకారమే పార్లమెంటులో అడుగుపెట్టిన అమిత్ షా రాజ్యాంగ వ్యతిరేకంగా మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. భారతదేశానికి ప్రపంచానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక దేవుడని, అంబేద్కర్ దయవలనే రిజర్వేషన్లు ఉన్నాయని, పార్లమెంటులో మాట్లాడే స్వేచ్ఛ లభించిందన్నారు. దేశం కోసం కుటుంబాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని, ఆయనను అవమానించే రీతిలో మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బండి నరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, బహుజన సమాజ్ పార్టీ అసెంబ్లీ అధ్యక్షులు కోకిల అజయ్ కుమార్, సామాజిక న్యాయ పోరాట వేదిక ఉపాధ్యక్షులు గంగారపు రాజు, కార్యవర్గ సభ్యులు గంగారపు అన్వేష్, ఎర్రబెల్లి రమేష్, టి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు రానా ప్రతాప్ తో పాటు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయం

- విద్యార్థుల సంక్షేమానికి డైట్ చార్జీలను పెంపు
- కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** విద్యార్థులకు మంచి విద్యాబోధనతో పాటు నాణ్యమైన బోజనం అందించమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పేర్కొన్నారు. గురువారం మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు వెంకటాపూరం మండలం బూరుగుపేట గ్రామంలోని బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వం గురుకులాలకు డైట్ చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తూ,నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, అలాగే 10 వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం మధ్యాన భోజనం సమయంలో విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటుచేసుకుని భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి-అశ్విన్ రాథోడ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, జిల్లా యూత్ కార్యదర్శి ప్రంజల్, జిల్లా యూత్ అధికార ప్రతినిధి నేపాల్ రావు, యూత్ జిల్లా కోశాధికారి అన్వేష్, యువజన కాంగ్రెస్ వెంకటాపూర్ మండల అధ్యక్షులు కట్టెకోళ్ల వెంకటేష్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు పూసాల పవన్, మండల యూత్ ఉపాధ్యక్షులు కాసర్ల రాజు పటేల్, వెంకటాపూర్ మండల యువజన నాయకులు ఖాజా, నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల కొత్త ట్రిక్కులు

**కోదాడ/అనంతగిరి, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్నీ తమ రోజువారి కార్యకలాపాల్లో అమలు చేస్తుండగా.. సైబర్ నేర గాళ్లు అంతకుమించిన టెక్నాలజీని వినియోగిస్తూ అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన సైబర్ నేరగాళ్లకు మంచి అవకాశంగా మారింది. విద్యావంతులతో పాటు సామాన్య ప్రజలు కూడా ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం యాప్ల ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు.ఇదే సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది.సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వాటిని ఓపెన్చేసి ఓకే అని క్లిక్ చేస్తే.. సంబంధిత వ్యక్తుల ఫోన్లు హ్యాక్ అవుతున్నాయి. ఫలితంగా మనకు సంబంధం లేకుండానే మన ఫోన్ నియంత్రణ సైబర్ నేర గాళ్ల చేతిలోకి వెళ్తుంది. తమ ఫోన్ హ్యాక్ అయ్యిం దని తెలియని వారు డిజిటల్ ప్లాట్ఫామ్స్ ద్వారా సొమ్ము పంపితే వెంటనే హ్యాక్ చేసిన మొబైల్ నం బర్ ద్వారా పిన్ నంబర్ తెలుసుకుని నిమిషాల్లో ఆ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదు కాజేస్తున్నారు. హ్యాక్ చేసిన మొబైల్ డివైస్ డిస్ప్లే సైబర్ నేరగాళ్ల చేతిలో ఉంటుంది. దీని ప్రకారం ఆ ఫోన్లో ఉన్నకాంటాక్ట్ నంబర్లకు ఫోన్ హ్యాకింగ్కు గురైన వ్యక్తి పంపినట్లు ఏపీకే ఫైళ్లను పంపుతున్నారు. నిజం గానే మనకు తెలిసిన వ్యక్తి నుంచే ఈ మెసేజ్ వచ్చిందని భావించి ఏపీకే ఫైళ్ల లింక్ ఓపెన్ చేస్తున్నారు. దీంతో బ్యాంకు ఖాతాలో సొమ్ము కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ యోజన పథకం పేరిట లింక్ పంపుతున్నారు. ఈ లింక్ను ఓపెన్ చేసినా కూడా ఫోన్ హ్యాక్ అయ్యి మనకు సంబంధం లేకుండానే బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులను సైబర్ నేరగాళ్లు లాగేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే అనవసర లింక్లను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలోని సొమ్ము ఖాళీ అవ్వడం ఖాయం.

# వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధనలకు నాంది

- శాస్త్రవేత్తలకు పుట్టినిల్లు భారతదేశం
- విద్యార్థుల ప్రయోగాలు రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలి
- అడిషనల్ కలెక్టర్ రాంబాబు



**కోదాడ, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధన రంగాలకు నాంది పలకాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి పాఠశాలలో సూర్యాపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 52వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజానికి మనుగడ సైన్స్ అండ్ టెక్నాలజీ అని అన్నారు. సైన్స్ లేకపోతే జీవితమే లేదని విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభిరుచిని పెంచుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు డాక్టర్లు ఇంజనీర్లు ఉపాధ్యాయులు శాస్త్రవేత్తలు కావాలని కలలు కంటున్నారని వారి కలలను సాకారం చేయాలన్నారు. భారతదేశం శాస్త్రవేత్తలకు పుట్టినిల్లు అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు జీవితాన్ని దారం పోసిన అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తల యొక్క ఆశయాలను శాసించాలన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యానందిస్తున్నాయన్నారు .ప్రతిభకు పేదరికం అడ్డు కాదని విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. సూర్యాపేట జిల్లా విద్యార్థుల వైజ్ఞానిక ప్రయోగాలు రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. ప్రతిష్టాత్మకంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ను ఆయన అభినందించారు. సభాధ్యక్షులు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా 23 మండలాల నుండి 84 ఇన్స్పైర్ అవార్డుల ప్రయోగాలు, 312 ప్రదర్శనలు పలు పాఠశాలల నుండి ప్రదర్శనలు వచ్చాయని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు ఉపాధ్యాయ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ప్రదర్శనకు ముందు విద్యార్థులు నిర్వహించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి విద్యార్థులను ప్రోత్సహించారు. వైజ్ఞానిక ప్రదర్శన లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అంబరాన్ని అంటాయి. వైజ్ఞానిక ప్రదర్శన గురు శుక్రవారాల్లో కొనసాగుతుందని ఆయన చెప్పారు. డివో అశోక్ , వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామా రావు , ఆర్డీవో సిహెచ్ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు , జిల్లా సైన్స్ అధికారి ఎల్ దేవరాజ్,మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఎంపీడీవో రామచంద్రరావు,ఎంఈఓ సలీం షరీఫ్, ఛాత్రు నాయక్, కౌన్సిలర్ గంధం యాదగిరి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైన్స్ ఫెయిర్ కమిటీల కన్వీనర్లు, కో కన్వినర్లు,సభ్యులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు..

## మొగిలయ్య మృతి బడుగుల సాహిత్య రంగానికి తీరని లోటు



**నర్సంపేట, డిసెంబర్ 19(నినాదం న్యూస్):** తెలంగాణా జానపద కళాకారుడు పస్తం మొగిలయ్య మృతి బడుగుల సాహిత్య రంగానికి తీరని లోటని నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య గత కొంత కాలంగా అన్నారోగ్యంతో ఆసుపత్రి లో చికిత్స పొందుతూ గురువారం మరణించడం జరిగింది. విషయం తెలిసిన నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది మొగిలయ్య పార్తీహ దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన మొగిలయ్య బేడా బుడగ జంగాల జానపద కళారూపం "శారద కథ " లకు బహుళ ప్రాచుర్యంలోకి తీసుకొచ్చాడన్నారు.తుంబుర వాయిద్యం తో ఈ కళకు మొగిలయ్య గొప్ప ఆదరణను తీసుకొచ్చాడని ఆయన సేవలను కొనియాడారు. శారద తుంబురా మీటుతూ, ప్రక్కనే బుర్ర( డక్కి ) వాయిస్తూ ఆయన సతీమణి కొమురమ్మ తో కలిసి పలు ప్రదర్శన లు ఇవ్వడం జరిగిందని ఆయన వివరించారు. మొగిలయ్య ఇచ్చిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. 'బలగం ' సినిమా లో చివర లో పాడిన పాట తెలంగాణా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి పోయిందని, ఆయన మృతి తెలంగాణా సాహిత్య రంగంలో ఒక మైలు రాయి వంటిదని సుదర్శన్ రెడ్డి తెలిపారు.అనంతరం మొగిలయ్య సతీమణి కొమురమ్మ ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.. ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి,దుగ్గొండి మండలం మాజీ ఎంపీపీ కాట్ల భద్రయ్య, రంగారావు,మాజీ ఎంపీటీసీ ఆరె మహిపాల్, మాజీ సర్పంచ్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.మొగిలయ్య మృతి బడుగుల సాహిత్య రంగానికి తీరని లోటు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన బిట్స్ విద్యార్థులు



**భూపాలపల్లి, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ విద్యార్థులు "సీ.ఎం. కప్ 2024 - 25" లో భాగంగా రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో డీవైఎస్ఓ, జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్ బాల్ పురుషుల విభాగం నుండి బాలాజీ విద్యార్థులు ఎంపికయ్యారని, త్వరలో ఈ నెల 27 నుండి 29 వరకు హైదరాబాద్ లోని జింఖానా మైదానంలో జరగబోయే రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలలో పాల్గొంటారని స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్ తెలియజేశారు. ఈ పోటీలకు ఎంపికైన 10 వ తరగతి విద్యార్థులు పిక్కల సాత్విక్, చంద్రగిరి రితిక్ బాబు లను ప్రిన్సిపాల్ పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించాలని, జిల్లాకి, పాఠశాలకి, వారి తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. విద్యార్థులకు విద్యతో పాటు మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ముఖ్యమని, దానిలో భాగంగానే విద్యార్థులకు ప్రతిరోజు క్రీడలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలియజేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ ఏ. వనజ, సెక్రటరీ జి .రాజేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా



**కోదాడ, డిసెంబర్ 19(నినాదం న్యూస్):** ఉపాధ్యాయుల సమస్యలను చట్టసభల్లో పరిష్కారం కోసం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి హాజరయ్యారు. 2025 మార్చి నెలలో జరగబోయే వరంగల్,ఖమ్మం,నల్లగొండ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. మోడల్ స్కూల్,కేజీబీవీ, సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం జరిగే విధంగా చట్టసభల్లో తమ గొంతుకై వినిపిస్తామని తెలియజేశారు. జీవో నెంబర్ 010 ద్వారా ప్రతినెల ఒకటో తారీఖున వేతనాలు చెల్లించే విధంగా చట్టసభలో ప్రశ్నిస్తామన్నారు. ఒకటో నెంబర్ పై ఓటు వేసి తమను గెలిపించాలని ఉపాధ్యాయుని అభ్యర్థించారు.

## అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం



**కోదాడ, డిసెంబర్ 19(నినాదం న్యూస్):** ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళుతున్న తమను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామీకమని మాల మహానాడు జిల్లా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు హైదరాబాద్ వెళుతున్న తమను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అరెస్టులతోతమ ఉద్యమాన్ని ఆపలేరని ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం వెంటనే వర్గీకరణను నిలిపివేయాలని లేనిపక్షంలో మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు,జిల్లా యూత్ అధ్యక్షులు కందుల శ్రీకాంత్,నాగేంద్ర,పాలపాటి సుమలత,విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

## స్వాములకు అన్నదానం పుణ్యకార్యం



**కోదాడ, డిసెంబర్ 19(నినాదం న్యూస్):** అయ్యప్ప స్వాములకు అన్నదానం అభినందనీ యమని కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రావెళ్ల రావెళ్ల కృష్ణారావు ,మాలతి దంపతుల కుమార్తె రావెళ్ళ సాయిశ్రీ పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప స్వాములకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జన్మదిన వేడుకలని వృధా ఖర్చులు చేసే ఈ రోజుల్లో రావెళ్ళ సాయిశ్రీ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం ఆదర్శనీయమన్నారు. సాయి శ్రీ ఆధ్యాత్మిక సేవా భావాన్ని కొని యాడారు. అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పది అన్నారు స్వాము ల దీక్షలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల కృష్ణారావు మాలతి, తాళ్లూరి నరసింహారావు సరిత సందీప్ సాయి పాల్గొన్నారు

## ఇందన పొదుపుపై విద్యార్థులకు అవగాహన




**చింతపల్లి, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** మండలంలోని తీదేడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇందనం పొదుపు పై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఉమ్మడి నల్లగొండ జిల్లా మేనేజర్ మర్రు పాండురంగారావు ఆధ్వర్యంలో ఇంధన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం సురేందర్, మాజీ సర్పంచ్ లు కాయితి జితేందర్ రెడ్డి,దాసరి శ్రీనివాస్ యాదవ్, ఎస్ఎంసి.చైర్మన్ మురుపోజు రాజేశ్వరి, కాయితి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష డప్పులు..వెయ్యి గొంతులతో దండోరా ప్రదర్శన



**నూతనకల్ డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** హైదరాబాదులో జనవరి 27న లక్ష డప్పులు, వెయ్యి మంది కళాకారుల గొంతులతో దండోరా ప్రదర్శన సభ ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ,ఏపూరి సోమన్న పర్యవేక్షణలో కళా నాయకుల కావతు ను విజయవంతం చేయాలని గురువారం మండల కేంద్రం విలేకరుల సమావేశంలో గంటా బిక్షపతి అన్నారు. తదనంతరం ఎమ్మార్పీఎస్ అనుబంధం సంస్కృతిక మాదిగ కళా కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షుడు ఇరుగు వెంకన్న ,ఉపాధ్యక్షుడు వినీత్, ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకన్న, ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు నకరికంటి వెంకన్న ,చిరంజీవి వివిధ కమిటీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి చేస్తా



**నూతనకల్ డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ దశలవారీగా అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని గురువారం తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అతని నివాసంలో అన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ ను సర్ఫ్ ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో ఏపీఎం రమణాకర్, సిసి సరస్వతి, ముత్తయ్య, ఉదయ్ కిరణ్, శైలజ, వివోఏ మండల ప్రెసిడెంట్ జ్యోతి,వివిధ గ్రామాల వివోఏ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పై కేసు

**కోదాడ/అనంతగిరి, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పై అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గురువారం ఉదయం సమయంలో ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల వాగు నుండి అక్రమంగా దొంగతనంగా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా టిప్పర్ లో ఇసుకను తరిలిస్తుండగా అనంతగిరి మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులో పట్టుకొని డ్రైవర్ వేముల వీరన్న, టిప్పర్ యజమాని కంతేటి కుమార్ పై కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్ వచ్చేలా కృషి
- పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్, డిసెంబర్ 19(నినాదం న్యూస్) :** తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కై 10వరోజు నిరవధిక సమ్మె చేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను కలసి తన పూర్తి మద్దతును తెలిపిన పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు జగిత్యాల , మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో కలెక్టరేట్ ముందు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజ్ 10వరోజు నిరసన సమ్మె శిబిరాన్ని సందర్శించి ట్రస్మా సంఘం తరపున 33 జిల్లాల్లో సంపూర్ణ మద్దతు తెలిపిన పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు. గత ప్రభుత్వము ఇచ్చిన న్యాయమైన హామీలను వెంటనే నెరవేర్చి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10 లక్షలు ఆరోగ్య బీమా ఐదు లక్షల సౌకర్యాలు కల్పించాలని కోరారు 12 నెలల వేతనముతో పూర్తి జీతభత్యాలు చెల్లించాలని కోరారు.మహిళలకు 180 రోజుల తో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ వచ్చేలా కృషి చేయాలని కోరారు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని కోరారు.ప్రస్తుత గవర్నమెంట్ అమ్మపెట్టాదు అడుక్కోని తిననివ్వదు అన్న తీరుగా తయారైంది అని అన్నారు. ఇప్పటికైనా గవర్నమెంట్ స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేదంటే ప్రతి జిల్లా నుండి పాద యాత్రగా వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు జగన్ రెడ్డి, రాజు సెక్రటరీ,రవిప్రసాద్, కృష్ణారెడ్డి,వెంకటరమణ మంచిర్యాల జిల్లా ట్రస్మా అధ్యక్షులు సిద్దయ్య ట్రస్మా రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు వర్ధన్ రావు ,మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రామ్ వేణు ఆసిఫాబాద్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు దేవభూషణం జిల్లా కార్యవర్గ సభ్యులు వీరేంద్ర చారి, కిరణ్, సురేష్, కిషన్ రావు ట్రస్మా బాధ్యులు పండుగ రమేష్ అనంతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంగ్లీష్ సబ్జెక్టుపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు



**జమ్మికుంట, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** హుజురాబాద్ పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు గురువారం రోజున విద్యార్థిని విద్యా ర్థులకు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్,భవన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోకెన్ ఇంగ్లీష్ హన్మకొండ నిర్వాహకులు జి.దామోదర్ ఆంగ్లము లో గల సందేహాలను సులభమైన పద్ధతిలో బోధించారు.వార్షిక పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి,తరచుగా ఇంగ్లీష్ సబ్జెక్టు లో చేసే తప్పులను విద్యార్థులకు తెలుపుతూ,ఏవిధముగా చదివితే గరిష్ట మార్కులు సాధించగలమో సులభ పద్ధతిలో వివరించారు.ఇట్టి కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ వి.అంజనేయరావు,ఇంగ్లీష్ అధ్యాపకురాలు ఆర్.రజిత,ఇతర అధ్యాపకులు సుగుణ,తులసీ దాసు,జ్యోతి,శైలజ,రేణుకా, సాయిచరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పంబాల కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- వెనుకబాటు ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పించాలి
- ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం
- న్యాయం జరిగే వరకూ మా పోరాటం ఆగదు
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు



**జమ్మికుంట, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన కులాలలో ఒకటైన పంబాల కులస్తులను ఎస్సీలుగా గుర్తించి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ ను కలిసి వినతి పత్రం అందించిన పంబాల కుల సంఘ నాయకులు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు మాట్లాడుతూ,పంబాల కులవృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్ చైర్మన్ కలవడం జరిగిందని ఈరోజు పంబాల కుల స్థితిగతుల మీద నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. .పంబాల కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్పించాలని పంబాలవారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీఓ ద్వారా కాకుండా మండల తాసిల్దార్ ద్వారా ఇవ్వాలని అత్యంత వెనుకబడిపోయిన మా యొక్క వృత్తి 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జనాభా ప్రాతిపదికన కాకుండా వెనుకబాటు ప్రాతిపదికన మాకు ఎక్కువ శాతం రిజర్వేషన్ కల్పించాలని మా యొక్క కులాస్థితిగతుల మీద ఈరోజు నివేదిక ఇవ్వడం జరిగింది ఈ నివేదిక కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సుద్దాల కుమారస్వామి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల భూపాల్ రాజు రాష్ట్ర కోశాధికారి బత్తుల శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శి రౌతు ఎల్లయ్య కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గొట్టె రఘుబాబు మరియు కరీంనగర్ జిల్లాలోని పంబాల కళాకారులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

# సభ్యత్వం రద్దు చేయాలి

- అంబేద్కర్‌ను అవమానించడం హేయమైన చర్య
- అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాచపల్లి సాగర్
- ఈ దేశ పౌరులకు అమిత్ షా క్షమాపణ చెప్పాలి
- అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



**జమ్మికుంట, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** కేంద్ర హెూంశాఖ మంత్రి బిజెపి నాయకులు అమిత్ షా బుధవారం పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వెంటనే అమిత్ షా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేసి మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్చార్జ్ రాచపల్లి సాగర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలో ఒక బాధ్యత గల పదవిలో ఉండి అంబేద్కర్ పై అమిత్ షా మాట్లాడిన మాటలు యావత్తు దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని అంబేద్కర్ పై అదేవిధంగా రాజ్యాంగంపై మీకు మీ పార్టీకి ఉన్న కుట్ర"డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ శిల్పి మాత్రమే కాకుండా, దేశ సమానత్వ స్ఫూర్తికి ప్రతీక. దేశ ప్రజలు ఎప్పటికీ ఆయన సేవలను గౌరవంతో స్మరించు కుంటారని అన్నారు. అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అగ్రకుల దురహంకారాన్ని ప్రదర్శిస్తూ, సబ్బండ వర్గాలను అవమానించే విధంగా ఉన్నాయి. వెంటనే అమిత్ షా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఆయనను హెూం మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం "అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన మహానేత అంబేద్కర్ గారి గురించి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు భారత ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని సాగర్ తెలిపారు. ఇది మానవ సమానత్వానికి, రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ఉంది. వెంటనే ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని జాతికి క్షమాపణ చెప్పాలని, హెూంమంత్రి పదవికి రాజీనామా చేయాలని" తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేశారు.

# కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



**జమ్మికుంట, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా బుధవారం పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో హుజరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవహేళన చేస్తూ అవమాన పరిచిన హెూం శాఖ మంత్రి అమిత్ షాను బర్త రఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒక ఉన్నతమైన పదవిలో ఉన్న నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని బిజెపి అధిష్టానం వెంటనే పార్టీ నుండి ఆయనను తొలగించాలని అతనిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎర్ర రవీందర్ సొల్లు బాబు లంక దాసరి లావణ్య కొలిపాక శంకర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మిడిదొడ్డిరాజు ఎర్ర రమేష్ కడారి తిరుమల సొల్లు సునీత ప్రజాసంఘాల నాయకులు వేల్పుల ప్రభాకర్ మోరే సతీష్ ఇల్లందుల సమ్మయ్య వెంకటేశ్వర్లు దాట్ల ప్రభాకర్ తిప్పారపు భువన చందర్ రేణిగుంట్ల సందీప్ చిట్యాల రేవంత్ ఎండి ఆఫీసర్ ఎండి సాదిక్ రాజయ్య సదానందం తదితరులు పాల్గొన్నారు

# టీబీ వ్యాధిపై అపోహలు అవసరం లేదు

- టీవీ వ్యాధిపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం
- అప్రమత్తత నివారణతో వ్యాధి దూరం
- హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి



**జమ్మికుంట, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని క్రిష్ణా కాలనీలో వంద రోజుల టి బి నిక్షయ్ శివిర్ కాంపెయిన్ లో భాగంగా టి బి వ్యాధి పై ఆరోగ్య అవగాహన సదస్సును డాక్టర్ చందన ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ చందన హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి టి బి వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాపించు విధానం తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి క్లుప్తంగా వివరించి, అవగాహన కల్పించినారు. ప్రజలకు టి బి వ్యాధి పట్ల అవగహన అవసరమని, టి బి వ్యాధి ప్రాణాంతకం కాదని, అలాగని ఆశ్రద్ద చేయరాదని ప్రజలకు సూచించారు. రెండు వారాలకు మించి ఎడతెరపిలేని దగ్గు, దగ్గులో తెమడ పడటం, బరువు తగ్గటం, ఆకలి మందగించడం, రాత్రి పూట చెమటలతో జ్వరం రావటం, అలసట, ఆయాసం వంటి లక్షణాలు ఉంటే ఆశ్రద్ద చేయకుండా వెంటనే వైద్యుల సలహా తీసుకొని, గవర్నమెంట్ హాస్పిటల్ లో తెమడ పరీక్ష ఎక్స్ రే పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. టి బి వ్యాధి అంటువ్యాధి అని, ఇది ఒకరినుండి మరొకరికి గాలి ద్వారా తుంపర్ల ద్వారా వ్యాపిస్తుంది అని అన్నారు. టి బి వ్యాధికి పేద ధనిక, చిన్న పెద్ద తారతమ్యం తేడా లేకుండా అందరికి వ్యాపిస్తుంది అన్నారు. టి బి వ్యాధి ఎక్కువగా పోషకహారం లోపం ఉన్న వారికి వస్తుందని, దీనిని ఆశ్రద్ద చేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించినారు. టి బి వ్యాధి నిర్ధారణ ఐతే, వారికి ఉచితం గా ప్రభుత్వం వారు మూడు నుండి ఆరు నెలల వరకు మందులు పంపిణీ చేస్తుందని, మంచి పోషకహారం తీసుకోవడంకోరకు వ్యాధి గ్రాస్తునికి ప్రభుత్వం వారు నెలకి 1000/- రూపాయలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలో మందులు వాడినన్ని నెలలకు జామచేస్తారని చెప్పినారు. ఈ కార్యక్రమములో డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ అరుణ, హెల్త్ అసిస్టెంట్ సరేందర్, ల్యాబ్ టెక్నీషియన్ రామక్రిష్ణ, స్వప్న ఆశా వర్కర్లు కాలనీ వాసులు పాల్గొన్నారు

# అధైర్య పడొద్దు త్వరలో ప్రభుత్వం శుభవార్త చెబుతుంది

- మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మీకు రక్షణ కవచంగా ఉంటా
- సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు సంఘీభావం తెలిపిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, డిసెంబర్ 19(నినాదం న్యూస్) :** సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కరీంనగర్ -అదిలాబాద్ -నిజామాబాద్ -మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు గురువారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ముందు గత కొన్ని రోజులు గా తమ డిమాండ్లు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెకు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు రేవంత్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎవరు ఆందోళన పడొద్దని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టు కుంటుందని, ఉద్యోగులందరికి న్యాయం జరిగే విధంగావారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. మీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని ఏ ఒక్కరు అధైర్య పడద్దని త్వరలోనే ప్రభుత్వ మీకు శుభవార్త చెబుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**జమ్మికుంట, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** మత్తు పదార్థాలు సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట సీఐ వరగంటి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని గంద్రపల్లి గ్రామంలో గల కస్తూర్బా పాటశాలలలో సైబర్ నేరాలపై, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ పై జమ్మికుంట సీఐ వరగంటి రవి కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జమ్మికుంట పట్టణంతోపాటు మండలంలోని గంద్రపల్లి గ్రామంలో గల కస్తూర్బా పాఠశాలలో డ్రగ్స్ సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ రవి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న ఆశలను కలలను సాకారం చేయాలని తెలిపారు. క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయ బృందం పోలీసు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుల తడక లాగ ఎమ్మెల్సీ ఓటర్ జాబితా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్



**కరీంనగర్, డిసెంబర్ 19(నినాదం న్యూస్) :** పట్టభద్రుల నియోజకవర్గం ఉమ్మడి నాలుగు జిల్లాలు ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్ నమోదు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది దాని ప్రకారం అందరూ కూడ డిగ్రీ పాసైన సర్టిఫికెట్లు, ఫోటో, ఆధార్ కార్డు, తప్పనిసరిగా ఇవి పెట్టి నమోదు చేసుకోవాలని ఎలక్షన్ కమిషన్ వారు చెప్పడం జరిగింది.ఈ జనవరి లో ఓటర్ జాబితా వస్తుంది కానీ జాబితా ఇప్పటి వరకు చూస్తే తప్పుల తడక లాగ ఉంది.ఒక్కోకరి పేర్లు రెండు చోట్ల మూడు చోట్ల నాలుగు చోట్ల ఇలా ఒక్కరి ఓటు దాదాపు ఎనిమిది సార్లు నామోదు అయి ఉంది. ఎన్నికల అధికారుల తప్పిదామా లేక వారి క్రింద సిబ్బంది నిర్లక్ష్యం ఉందా అనేది ఎలక్షన్ కమీషన్ పూర్తి స్థాయిలో విచారణ చెప్పటాలి.ఇది మన కరీంనగర్ జిల్లాకే పరిమితం అయ్యింది కాదు ఈ సమస్య నాలుగు జిల్లాలకు సంబంధించిన విషయంమే.
ఓటర్ లిస్టులో అన్ని తప్పదాలే ఉన్నాయి కనుక అధికారులు ఇప్పటికైన ఈ విషయంలో దృష్టిలో ఉంచుకుని సరైన విచారణ చెయ్యాలి. మరి ఇది తప్పిదామ లేక మేము పెద్దఎత్తున ఓట్లు నామోదు చేయించాము అని చెప్పుకునే అభ్యర్థుల తప్పిదాల అనే విషయాన్ని అధికారులు తేల్చి చెప్పాలి అని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది.ఉమ్మడి నాలుగు జిల్లాలలో మొత్తం వేల సంఖ్యలో ఇలా ఒక్కరిది రెండు సార్లు, మూడు సార్లు, నాలుగు సార్లు నామోదు అయి ఉన్నాయి ఒక ఓటు ఒక ఆధార్ కార్డు అని చెప్పే అధికారులు ఒక్కరూ ఇన్ని ఓట్లు ఎలా పొందా గలిగినారో తెల్చి చెప్పాలి అని మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, గొట్టం మహేష్, పోన్నం అనీల్ గౌడ్, కెమసారం తిరుపతి, పెండ్యాల మహేష్, సాయిండ్ల కొమరయ్య, బుడిగె పర్శరం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ టీ 10 లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహణ




**కరీంనగర్, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** కరీంనగర్ టి 10 లీగ్ క్రికెట్ మ్యాచ్ తెలంగాణ యూత్ ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొన్నం శివగౌడ్ ఆర్గనైజేషన్లో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ నాలుగు జిల్లాల నుండి 40 క్రికెట్ జట్టులు కరీంనగర్ లోని రాపూర్ గిద్దె పెరుమాండ్ల గ్రౌండ్ లో 10 రోజులు హెూరాహెూరుగా క్రికెట్ మ్యాచ్ ల పోటీలు నిర్వహించారు. కప్ ప్రదానోత్సవ సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి బుర్ర జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ,క్రీడల వలన శరీర దారుఢ్యం , మానసిక ఉల్లాసం కలుగును, ఆటలలో పాల్గొనడం ముఖ్యమని గెలుపు ఓటములు దైవాదీనమన్నారు. క్రికెట్ మ్యాచ్ కప్ దాతలు డా. బండారు రాజకుమార్, మర్రి సతీష్, బత్తిని అనిల్ గౌడ్, బుర్ర జగదీశ్వర్ గౌడ్, గంగాధర్ రెడ్డి లు. ఆటలలో గెలుపొందిన మొదటి విన్నర్ జిఆర్ 11వ రాజేశం, 2వ విన్నర్ రహమత్11వ షాఫీక్ టీం, 3వ విన్నర్ ఎస్పీ 11వ పొన్నం శివ టీం, 4వ విన్నర్ ఆర్సిఎ దిలీపు రెడ్డి టీం లు.ఆర్గనైజర్స్ అనిల్ నాయక్, ఉదయ్, నవీన్, హన్మంతు ఆర్గనైజేషన్లో వందల మంది పాల్గొన్న క్రీడాకారుల ఆనందోత్సాహల మధ్య గెలుపొందిన క్రికెట్ మ్యాచ్ జట్లకు కప్ లను ప్రదానం చేశారు. కెప్టెన్ కు వాకర్స్ ఇంటర్నేషనల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి బుర్ర జగదీశ్వర్ గౌడ్ రెండు వేల రూపాయలు నగదు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వాకర్లు, ప్రజలు, క్రీడాకారులు, క్రికెట్ మ్యాచ్ కప్ దాతలు డా. బండారు రాజకుమార్, మర్రి సతీష్, బత్తిని అనిల్ గౌడ్, బుర్ర జగదీశ్వర్ గౌడ్, గంగాధర్ రెడ్డి లు తదితరులు పాల్గొన్నారు.

# తనుగులలో వారసంత ప్రారంభం

- ప్రజలకు అందుబాటులో అన్ని రకాల కూరగాయలు
- పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్



**జమ్మికుంట, డిసెంబర్19 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామంలో నూతనంగా కూరగాయల వార సంతను గురువారం గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం గ్రామంలో జరిగే కూరగాయల అంగడి ద్వారా చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్, పోశాల శ్రీనివాస్, మూల ప్రభాకర్,జక్కే కిరణ్, శ్రీనివాస్, చంద్రమౌళి, రమేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు

## అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన

# ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్



**కరీంనగర్, డిసెంబర్ 19(నినాదం న్యూస్) :** కేంద్ర హెూమ్ మినిస్టర్ అమిత్ షా ప్రతిపక్ష ఎంపీలను పట్టుకొని అంబేద్కర్ అంబేద్కర్ అనే పేరును పదేపదే ప్రస్తావిస్తూ మాట్లాడడం ఒక పేషన్ అయిందని , దానికి బదులు ఏదైనా దేవుణ్ణి స్మరించుకుంటే ఏడు జన్మల వరకు స్వర్గం దొరుకుతుందని ఆనాడాన్ని తీవ్రతి తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు.పార్లమెంటులో 75 సంవత్సరాల రాజ్యాంగం పైనే చర్చ జరుగుతున్నప్పుడు మరి ఆ చర్చలో వందలసార్లైన అంబేద్కర్ పేరు తీయాల్సిన పరిస్థితి వస్తుంది తప్ప గాంధీ, పేరు నెహ్రూ పేరు, సుభాష్ చంద్రబోస్ పేరు సర్దార్ వల్లభాయ్ పటేల్ పేర్లు దేవుని పేరు ప్రస్తావించాల్సిన అవసరం రాదన్నారు. అయితే అంబేద్కర్ కు రాజ్యాంగానికి ఎందుకు ఇంత ప్రాముఖ్యత వచ్చిందంటే 3 వేల సంవత్సరాల భారతదేశ చరిత్ర, ప్రపంచ చరిత్రను అధ్యయనం చేసి, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, న్యాయ శాస్త్రాలపై ప్రపంచ ప్రఖ్యాతగాంచిన యూనివర్సిటీలలో అధ్యయనం చేసి భారతదేశంలో సామాజిక ఆర్థిక రాజకీయ మార్పుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి దేశానికి ఒక గొప్ప రాజ్యాంగాన్ని అందించాడు కాబట్టి ఆ రాజ్యాంగమే ఈ భారతదేశాన్ని కాపాడుతుంది కనుక అంబేద్కర్ దేశానికి ఒక ఐకాన్ ఆయన అన్నారు.డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ ధరణిని అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వ పెద్దలు 1,50,000 కోట్లు భూ దందా చేశారని ఆయన తెలిపిన విషయాని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరఫున మేము కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకముందే చెప్పడం జరిగిందన్నారు. దీనిమీద కరీంనగర్ ప్రజలు, కరీంనగర్ మీడియా స్పందించాలని కోరారు. ధరణి కుంభకోణం పై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కొరివి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ మీడియా సమావేశంలో బోయిన్పల్లి చంద్రయ్య సిగిరి శ్రీధర్, రవీందర్ యాదవ్, బాపురెడ్డి, చంద్రశేఖర్, గజ్జల రవీందర్ లు పాల్గొన్నారు

# పీఆర్‌టీయూ టీజీ కరీంనగర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలిగా గంట సుజాత



**కరీంనగర్, డిసెంబర్ 19(నినాదం న్యూస్) :** కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న గంట సుజాత ని పిఆర్టియు తెలంగాణ కరీంనగర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలిగా నియమిస్తూ పిఆర్టియు తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గోనె శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి గార్లు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.పిఆర్టియు టిజి కరీంనగర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలిగా నియామకమైన గంట సుజాత మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలిగా నియమించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలియజేస్తూ పిఆర్టియు తెలంగాణ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎన్నికైన గంట సుజాత ని పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పాతూరి రాజ్ రెడ్డి, పబ్బ జ్యోతిలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు గుండేటి పుష్పలత, ఫర్హాత్ షాహీన్, జిల్లా కార్యదర్శులు కే. సుమ,గాలి మంజుల, కొత్తపల్లి మండల అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బూట్ల కనకయ్య తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చలికాలం పొడి చర్మం సమస్య



చలికాలంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల, తక్కువ తేమ శాతం కారణంగా చర్మం పొడిబారుతుంది .అది మనకు చిరాకును కలిగిస్తుంది. చర్మం దురద, మంటకు గురవుతుంది. అయితే శీతాకాలంలో చర్మం పొడిబారే సమస్యతో బాధపడే వారికి సింపుల్ హెూమ్ రెమెడీస్ ఇప్పుడు మీకోసం. చలికాలంలో చర్మం పొడిబారకుండా ఉండడం కోసం శరీరాన్ని ఎప్పటికప్పుడు మాయిశ్చరైజ్ చేసుకోవాలి. చలికాలం చర్మ సంరక్షణ ఇలా ఎటువంటి మాయిశ్చరైజర్స్ లేనివాళ్లు కొబ్బరి నూనెను ఒంటికి, ముఖానికి అప్లై చేసుకుంటే మంచిది. చలికాలంలో చర్మం పొడిబారకుండా ఉండాలంటే శరీరాన్ని డీ హైడ్రేట్ కాకుండా కాపాడుకోవాలి . అందుకోసం నీటిని ఎక్కువగా తాగాలి. చలికాలంలో ఉపయోగించే సబ్బులు, క్లెన్సర్లు, లోషన్లు కఠినమైన రసాయనాలు లేకుండా ఉండే వాటిని ఎంచుకోవాలి. %ూశ్రీంశీ =ఘుం% "ఊదలు తింటే ఊబకాయం పరార్!.. ఇలా ట్రై చేస్తే చాలు..!" ఇలా చేస్తే చర్మం పొడిబారటం గ్యారెంటీ వాసన ఎక్కువగా ఉండే లోషన్లలో ఎక్కువ రసాయనాలు కలుస్తాయి అనే విషయాన్ని గుర్తించి, ఎక్కువ వాసన లేని వాటిని ఎంచుకోవాలి. చలికాలం ఎక్కువసేపు వేడి నీళ్ల స్నానం కూడా చేయకూడదు. వేడినీళ్ల స్నానం చేస్తే హాయిగా ఉందని ఎక్కువసేపు వేడినీళ్ల స్నానం చేయడం వల్ల కూడా చర్మానికి అవసరమైన తేమ పోతుంది. దీనివల్ల చర్మం పొడిబారి ఇబ్బందికరంగా తయారవుతుంది. చలికాలంలో ఈ ఫుడ్ తినండి ఇక చలికాలం చల్లని గాలుల కారణంగా చర్మం పొడి మారుతుంది. కనుక చల్లని గాలుల నుంచి చర్మాన్ని కాపాడుకునేలా బట్టలు వేసుకోండి. చలికాలంలో సూర్యరశ్మి ఎక్కువగా మన శరీరం పైన పడకపోవడం వల్ల విటమిన్ డి లోపంతో కూడా చర్మం పొడిబారుతుంది. కనుక చలికాలంలో విటమిన్ రిచ్ ఫుడ్ ను ఎక్కువగా తినడం మంచిది. చిన్న టిప్స్ తో చర్మ ఆరోగ్యం చలికాలంలో మన చర్మానికి మేలు కలిగించే లాగా ఆహారంలో మార్పులు చేసుకోవడం తరచూ నీటిని తాగడం మన చర్మ సమస్యలను పరిష్కరిస్తుంది. శీతాకాలంలో ఆరోగ్యకరమైన చర్మం కోసం కొబ్బరి నూనె, పాల మీగడ, నెయ్యి, వెన్న వంటి వాటిని చర్మానికి రాసుకోవటం చేస్తే చర్మం సాఫ్ట్ గా మారుతుంది. మనం ఇంట్లోనే చేసే ఈ చిన్న చిన్న టిప్స్ ను ఫాలో అయితే మీ చర్మం సున్నితంగా ఆరోగ్యంగా ఉంటుంది.




# చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ చేసే ఆహారాలు

ప్రస్తుతం చాలామంది కొలెస్ట్రాల్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. శరీరంలో ఎల్డీఎల్ కొలెస్ట్రాల్ ను చెడు కొలెస్ట్రాల్ గా చెబుతారు. ఇది మన రక్తనాళాలలో కొవ్వు నిల్వలను పెంచుతుంది. రక్తప్రసరణను నిరోధిస్తుంది. గుండెపోటుకు కారణం అవుతుంది. హెచ్ డి ఎల్ కొలెస్ట్రాల్ ను మంచి కొలెస్ట్రాల్ గా చెబుతారు. అయితే మన శరీరంలో ప్రస్తుతం ఎల్డీఎల్ కొలెస్ట్రాల్ విపరీతంగా పెరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ చేసే ఆహారాలు ఈ కొలెస్ట్రాల్ మనకు అనారోగ్యాలను తెచ్చిపెడుతుంది. చాలామందికి గుండెపోటు రావడానికి ఇది కారణమవుతుంది. మనం నిజ జీవితంలో తీసుకునే ఆహారంతో ఈ కొలెస్ట్రాల్ ను కంట్రోల్ చేయవచ్చు .కొన్ని రకాల ఆహార పదార్థాలు మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను కంట్రోల్ చేయడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ప్రస్తుతం మనం వాటి గురించి తెలుసుకుందాం. ఓట్స్ మరియు బార్లీ గింజలు ఓట్స్ మరియు బార్లీ గింజలు మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను కంట్రోల్ చేయడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ఓట్స్ మరియు బార్లీ గింజలలో బీటా గ్లూకాన్ అని ఒకరకమైన కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మన రక్తంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. కూరగాయలు, పండ్లతో చెడు కొలెస్ట్రాల్ కు చెక్ కూరగాయలు, ఆకు కూరలు, మరియు పండ్లలో కూడా మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించే బోలెడు పోషకాలు ఉంటాయి కూరగాయలు పండ్లను తింటే గుండెజబ్బులు స్ట్రోక్స్ కొన్ని రకాల క్యాన్సర్లు రాకుండా ఉంటాయి వీటిల్లో కూడా కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది ఇవి చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి.

చిక్కుళ్ళు, బీన్స్, నట్స్ తో చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ చిక్కుళ్ళు, బీన్స్ కూడా మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. చిక్కుళ్ళు, బీన్స్ లో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఇవి మన శరీరంలో ఎల్డీఎల్ కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. మన శరీరంలో చెడు కొలె స్ట్రాల్ తగ్గాలంటే నట్స్ ఎంతో గానే ఉపయోగపడతాయి. నట్స్ ను క్రమం తప్పకుండా తినడం వల్ల మన శరీరం లో బ్యాడ్ కొలెస్ట్రాల్ తగ్గుతుంది. సోయా ఉత్పత్తులతోనూ చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ ఇక సోయా ఉత్పత్తులలో కూడా మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను, ట్రై గ్లిజరైడ్స్ ను తగ్గించే బోలెడు పోషకాలు ఉంటాయి. కనుక వీటిని మనం ఆహారంలో భాగంగా తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ ను కొంతమేరకు తగ్గించవచ్చు. మొత్తంగా చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ కోసం ఈ ఆహారాలు తినండి.

## అల్పాహారంగా మొలకెత్తిన గింజలను తింటున్నారా?

మొలకెత్తిన గింజలు పోషక విలువలతో నిండిన ఆహారం. వీటిని ఆరోగ్యానికి ఒక అద్భుతమైన ఆహారంగా తీసుకుంటాం. ఇవి విటమిన్ జ, ఖ, , మినరల్స్, ప్రొటీన్లు, ఫైబర్‌లకు గొప్ప మూలం. ప్రాసెస్ సమయంలో గింజలలోని పోషకాలు పెరిగి, తేలికగా జీర్ణమయ్యే విధంగా మారతాయి. అల్పాహారంగా మొలకెత్తిన గింజలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, అతిగా తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉండవచ్చు. మొలకెత్తిన గింజలతో ప్రయోజనాలు: మొలకెత్తిన గింజల్లో ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ సి, విటమిన్ కె, ఫోలేట్, ఇనుము వంటివి ఎక్కువగా ఉంటాయి. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. మొలకెత్తిన గింజల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో అతిగా తినడం నిరుత్సాహపడుతుంది. మొలకెత్తిన గింజల్లో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచే మరియు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మొలకెత్తిన గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ముడతలు, మచ్చలు వంటి సమస్యలను తగ్గిస్తుంది.

**దుష్ప్రభావాలు:** కొంతమందికి మొలకెత్తిన గింజలకు అలర్జీ ఉండవచ్చు. అలర్జీ ఉన్నవారు మొలకెత్తిన గింజలు తినడం వల్ల చర్మం దురద, ఉబ్బరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు ఎదుర్కోవచ్చు. అతిగా మొలకెత్తిన గింజలు తినడం వల్ల కొంతమందికి జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

## ఈ అనారోగ్య సమస్యలు ఉన్నవారు నెయ్యి అసలే తినొద్దు!



తీసుకునే ఆహారంలో మన శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. అయితే అన్ని ఆహారాలు అందరికీ మేలు చేయవు. వారి శరీర తత్వాన్ని బట్టి, వారికి ఉన్న ఇతర అనారోగ్య సమస్యలను బట్టి కొన్ని ఆహారాలు మేలు చేస్తే, కొన్ని ఆహారాలు హాని చేస్తాయి. మన శరీరానికి, ఆరోగ్యానికి నెయ్యితో ఎన్నో లాభాలు ఉంటాయని చాలామంది డైటీషియన్లు చెబుతారు. నెయ్యిలో ఫుల్ పోషకాలు అయితే కొన్ని అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పనిసరిగా నెయ్యికి దూరంగా ఉండాలని కూడా హెచ్చరిస్తున్నారు. సహజంగా నెయ్యిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. నెయ్యిలో విటమిన్ ఏ, విటమిన్ డి, విటమిన్ ఈ, విటమిన్ కె, ఒమేగా త్రీ, ఒమేగా సిక్స్ ఫ్యాటీ ఆసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, బ్యూటీరిక్ యాసిడ్స్, లీనోలిక్ వంటి బోలెడు పోషకాలు ఉంటాయి. వీరు నెయ్యికి దూరంగా ఉండాలి అయితే ఈ పోషకాలు ఇది తీసుకున్న వారికి ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయని చెబుతారు. కానీ కొన్ని అనారోగ్య సమస్యలతో బాధపడేవారు నెయ్యి తినకూడదని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవెల్స్ ఎక్కువగా ఉన్నవారు నెయ్యికి దూరంగా ఉండాలి. ఒకవేళ వారు తిన్నప్పటికీ చాలా మితంగా నెయ్యిని ఉపయోగించాలి. డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నవారు నెయ్యి ఎంత తక్కువగా తింటే అంత మంచిది. ఈ సమస్య ఉంటే నెయ్యి తీసుకోకూడదు నెయ్యిలో ఉండే కొవ్వుల కారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. కనుక వీరు నెయ్యి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడేవారు నెయ్యికి దూరంగా ఉంటేనే మంచిది. నెయ్యిలో ఉండే సాచ్యురేటెడ్ కొవ్వులు మన శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను మరింత పెంచే ప్రమాదం ఉంటుంది. ఇక జీర్ణ సమస్యలతో బాధపడే వారు కూడా నెయ్యిని ఎక్కువగా తీసుకోకూడదు.ఈ సమస్యలుంటే నెయ్యి తినకూడదు గ్యాస్, ఎసిడిటీ, వికారం, అజీర్ణం వంటి సమస్యలతో బాధపడేవారు నెయ్యి ఎక్కువగా తీసుకుంటే కడుపునొప్పి వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇక లివర్ వ్యాధితో బాధపడే వారు కూడా నెయ్యికి దూరంగా ఉండాలి. లివర్ సిర్రోసిస్, హెపటైటిస్ రోగులు నెయ్యి పూర్తిగా మానేస్తే మంచిది. చాలామందికి మిల్క్ ప్రొడక్ట్స్ కు సంబంధించిన పదార్థాలు ఏమి తీసుకున్న రియాక్షన్ వస్తుంది. చర్మం పైన దద్దుర్లు, మంట, వాపు వంటి సమస్యలు వస్తాయి. వీరికి నెయ్యితో డేంజర్.. జాగ్రత్త అలాంటివారు కూడా నెయ్యిని తీసుకోకుండా ఉంటేనే మంచిది. ఒబేసిటీతో బాధపడేవారు, గర్భిణీ మహిళలు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు నెయ్యి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వీరు నెయ్యి తీసుకోకుండా ఉంటేనే మంచిది. ఒకవేళ ఈ సమస్యలతో బాధపడేవారు నెయ్యి తీసుకోవాలి అనుకుంటే వైద్యుల సలహాతో తీసుకోండి.

మార్కెట్

## నష్టాలతో ముగిసిన సూచీలు

### బ్యాంక్, ఐటీ షేర్ల పతనం..!



యూఎస్ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ పావెల్ జెరోమ్ నర్మగర్భ వ్యాఖ్యల ఫలితంగా అంతర్జాతీయ, జాతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. కేవలం రెండు సార్లు మాత్రమే వడ్డీరేట్ల కోత ఉంటుందని ఫెడ్ రిజర్వ్ పేర్కొన్నది. దీంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీల్లో షార్ప్ కరెక్షన్ చోటు చేసుకుంది. ఫలితంగా రెండు సూచీలు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు 25 బేసిక్ పాయింట్లు తగ్గించినా, భవిష్యత్‌లో ఏమైనా జరుగొచ్చునన్న సంకేతాల మధ్య ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగారు. ఫలితంగా బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ టేడింగ్ ముగిసే సమయానికి 965.15 (1.20 శాతం) పాయింట్లు కోల్పోయి, 79,218.07పాయింట్ల వద్ద నిలిచింది. అంతర్గత ట్రేడింగ్‌లో 79,516.70 పాయింట్ల నుంచి 79,218.05 పాయింట్ల కనిష్ట స్థాయి మధ్య తచ్చాడింది.మరోవైపు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ-50.. 247.15 పాయింట్లు నష్టంతో 23,951.70 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్ లో 24,004.90 పాయింట్ల నుంచి 23,870.30 పాయింట్ల మధ్య తచ్చాడింది. ఎన్ఎస్ఈలో 36 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్, ఏషియన్ పెయింట్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, గ్రాసిమ్ తదితర స్టాక్స్ 2.33 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బీపీసీఎల్, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్ తదితర 14 స్టాక్స్ 4.04 శాతం వరకూ లబ్ధి పొందాయి. నిఫ్టీ మిడ్ క్యాప్-100 0.28, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 0.51 శాతం నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ ఫార్మా, హెల్త్ కేర్ లాభాలతో స్థిర పడ్డాయి. మరోవైపు బ్యాంక్ స్టాక్స్, ఐటీ, ఫైనాన్సియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్ తదితర ఇండెక్సులు ఒక శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్-30లో సన్ ఫార్మా, హిందూస్థాన్ యూనీ లివర్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లాభ పడ్డాయి. మరోవైపు బజాజ్ ఫిన్ సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు పతనం అయ్యాయి.

# పర్సనల్ లోన్ కోసం అప్లై చేస్తున్నారా?

**-ముందుగా ఇది తెలుసుకోవాలి?**

**-వడ్డీ రేట్లు, ఛార్జీలు సహా**




ఇటీవల చిన్న చిన్న అవసరాల కోసమైనా.. చాలా మంది బ్యాంకుల్లో పర్సనల్ లోన్లు తీసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. అయితే లోన్ తీసుకునే ముందు చాలా విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాలి. వడ్డీ రేట్లు బ్యాంకుల్ని బట్టి మారుతుంటాయి. ఇంకా దేంట్లో సురక్షితమో తెలుసుకోవాలి. ఛార్జీలు దేంట్లో ఎలా ఉన్నాయని ఇలా చాలా విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

**పర్సనల్ లోన్ అప్లికేషన్**

ఒకప్పటితో పోలిస్తే ఈ రోజుల్లో బ్యాంకుల్లో పర్సనల్ లోన్లు తీసుకునే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని చెప్పొచ్చు. బ్యాంకులు కూడా అంతకుముందు కంటే ఇప్పుడు ఈజీగానే లోన్లు మంజూరు చేస్తున్నాయి. పెద్దగా ప్రాసెసింగ్ టైమ్ కూడా పట్టట్లేదు. డాక్యుమెంటేషన్ కూడా పెద్దగా లేకుండానే క్షణాల్లో కూడా లోన్లు మంజూరు చేస్తున్నాయి. అయితే బ్యాంకుల్లో లోన్లు తీసుకునే ముందు దరఖాస్తుదారులు కొన్ని విషయాల్ని తెలుసుకోవాల్సి ఉంటుంది. వడ్డీ రేట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఒక బ్యాంకుకు ఇంకో బ్యాంకుకు వడ్డీ రేట్లలో చాలా తేడా ఉండొచ్చు. ఇంకా ఛార్జీలు కూడా ఇదే విధంగా ఒక్కో దాంట్లో ఒక్కోలా ఉండొచ్చు. ఇవేంటో మనం ఇప్పుడు చూద్దాం.ముందుగా క్రెడిట్ స్కోరు చాలా కీలకం. ముందునుంచే క్రెడిట్ స్కోరు 750 అంతకంటే ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. ఇంకా క్రెడిట్ కార్డుల్ని వాడుతున్నప్పుడు.. క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతం దాటకుండా చూసుకోవాలి. ఒకే సమయంలో ఎక్కువ క్రెడిట్ కార్డులు లేదా పర్సనల్ లోన్ల కోసం అప్లై చేయకూడదు. ఇదే క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఏ లోన్ అయినా గడువులోపు తీర్చేయాలి. అప్పుడే క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉంటుంది. క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉన్నప్పుడు తక్కువ వడ్డీకే లోన్ పొందొచ్చు. చాలా ప్రముఖ బ్యాంకుల్లో పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు 10 నుంచి 14 శాతం వరకు ఉన్నాయి. కొన్ని %చీదీఖీజ% లు బ్యాంకుల కంటే రెట్టింపు వడ్డీని వసూలు చేస్తున్నాయి. అందుకే మెరుగైన క్రెడిట్ స్కోరు నిర్వహిస్తూ.. తక్కువ వడ్డీ రేటుతోనే లోన్ తీసుకునేందుకు ప్రయత్నించాలి. ఈఎంఐ టెన్యూర్ కూడా వీలైనంత తక్కువగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడు వడ్డీ కూడా తగ్గే అవకాశం ఉంటుంది.లోన్ వేగంగా పొందాలంటే ఇప్పటికే శాలరీ అకౌంట్ లేదా డిపాజిట్స్ లేదా క్రెడిట్ కార్డు నిర్వహిస్తున్న బ్యాంకును సంప్రదించడం మంచిది. బ్యాంకుకు మీ నెలవారీ ఆదాయం, విత్‌డ్రాయల్ వివరాలు క్షుణ్ణంగా తెలుస్తాయి. అందుకే అకౌంట్ ఉన్నవారికి బ్యాంకులు తక్కువ వడ్డీ రేటు లేదా ప్రాసెసింగ్ ఫీజులతో రుణం తొందరగా వచ్చేందుకు వీలుంటుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో.. లేదా పబ్లిక్ సెక్టార్ యూనిట్స్‌లో ఉద్యోగం చేస్తున్న వ్యక్తులకు ఇంకా ఎంఎన్‌సీ లేదా ప్రముఖ పేరున్నటువంటి కంపెనీల్లో పనిచేసేవారికి లోన్లు ఇచ్చేందుకు బ్యాంకులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. ఈ ఉద్యోగ సంబంధిత పే స్లిప్స్ బ్యాంకుకు సమర్పించి లోన్ మంజూరు చేయమని కోరొచ్చు.చివరగా పర్సనల్ లోన్లపై బ్యాంకులు వడ్డీనే కాకుండా.. ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ వంటి ఇతర ఛార్జీలు విధిస్తాయి. కొన్ని బ్యాంకులేమో ఫ్లాట్ ప్రాసెసింగ్ ఫీజులు వసూలు చేస్తే.. ఇంకొన్ని లోన్ మొత్తంపై 1-3 శాతం వరకు ఫీజు వసూలు చేస్తాయి. లోన్ టెన్యూర్‌కు ముందే క్లోజ్ చేస్తే.. ఫోర్ క్లోజర్ ఛార్జీలు వసూలు చేస్తాయి.


## ఆకర్షణీయ ఫీచర్లతో కియా ఎస్‌యూవీ..

**-సైరోస్ బుకింగ్స్ జనవరి 3 నుంచి ప్రారంభం**



అద్భుతమైన ఫీచర్లతో కియా ఇండియా తీసుకొచ్చిన ఎస్‌యూవీ కారు కియా సైరోస్ బుకింగ్స్ జనవరి మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్నల్ కంబుస్టన్ ఇంజిన్ (ఐసీఈ)తో వస్తున్న మూడో కియా కారు ఇది. ఫిబ్రవరి నుంచి కార్ల డెలివరీ ప్రారంభం అవుతుంది. కియా ఈవీ9 స్ఫూర్తిగా రూపుదిద్దుకున్న కియా సైరోస్ లోనూ ఉంటాయి. కియా ఫ్లాగ్ షిప్ సైరోస్ కారు ధర రూ.1.29 కోట్లు (ఎక్స్ షోరూమ్) ఉండొచ్చునని భావిస్తున్నారు. సెకండ్ రో వెంటిలేషన్, ద్యుయల్ పేన్ పనోరమిక్ సన్ రూఫ్, లెవల్ 2 అడాస్ సేఫ్టీ ఫీచర్లు ఉంటాయి. సిగ్నేచర్ డిజిటల్ 'టైగర్ ఫేస్' గ్రిల్లె, 'ఐస్ క్యూబ్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, 'స్టార్ మ్యాప్' ఎల్ఈడీ డీఆర్ఎల్స్ విత్ ఇంటిగ్రేటెడ్ టర్న్ సిగ్నల్స్, రేర్‌లో 'స్టార్ మ్యాప్' ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్స్', షార్క్ ఫిన్ ఎంటీనా, ఇంటిగ్రేటెడ్ స్పాయిలర్ ఉంటాయి. కియా సైరోస్ 17- అంగుళాల క్రిస్టల్ కట్ అల్లాయ్ వీల్స్, పడెల్ ల్యాంప్స్, కియా లోగో, 30- అంగుళాల ట్రినిటి పనోరమిక్ డిస్ ప్లే ప్యానెల్ ఫర్ ఇన్ఫోటైన్ మెంట్, క్లైమేట్ కంట్రోల్, ఇన్ స్ట్రుమెంట్ ప్యానెల్, సెంట్రల్ కన్సోల్, ఇంటిగ్రేటింగ్ ఫిజికల్ బటన్స్, టైప్ సీ పోర్ట్స్, వైర్ లెస్ చార్జర్, గేర్ లివర్ తదితర ఫీచర్లతో సొగసుగా కనిపిస్తుందీ కారు. ఫ్రంట్ కొల్లిషన్ వార్నింగ్, ఫ్రంట్ కొల్లిషన్ అవాయిడెన్స్ అసిస్ట్, స్మార్ట్ క్రూయిజ్ కంట్రోల్, లీడింగ్ వెహికల్ డిపార్చర్ అలర్ట్, లేన్ డిపార్చర్ వార్నింగ్, లేన్ ఫాలో అసిస్ట్, హై బీం అసిస్ట్, డ్రైవర్ అటెన్షన్ వార్నింగ్, పార్కింగ్ కొల్లిషన్ అవాయిడెన్స్ అసిస్ట్, 360 డిగ్రీ కమెరా విత్ బ్లైండ్ వ్యూ మిర్రర్ వంటి లెవల్ 2 అడాస్ ఫీచర్లు ఉంటాయి.

# ట్యాక్స్ పేయర్లూ..'జులై' డెడ్‌లైన్ మిస్సయ్యారా?




ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ప్రతి సంవత్సరం కచ్చితంగా ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఎలాంటి ట్యాక్స్ ఆడిట్ అవసరం లేని వారికి జులై 31 వరకు గడువు ఉంటుంది. అయితే, వివిధ కారణాలతో చాలా మంది ఈ గడువులోపు తమ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేయలేకపోతారు. దీంతో చాలా మంది ఆందోళన చెందుతుంటారు. కానీ, ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. జులై 31 డెడ్‌లైన్ మిస్సైన వారికి ఇంకో అవకాశం ఉంటుంది. డిసెంబర్ 31వ తేదీలోపు బిలేటెడ్ ఐటీఆర్ ఫైల్ చేసేందుకు ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం అవకాశం కల్పిస్తుంది. అయితే, ఇక్కడ జరిమానాలు సహా తెలుసుకోవాల్సిన విషయాలు ఉన్నాయి.ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 139(4) కింద బిలేటెడ్ ఐటీఆర్ ఫైల్ చేయవచ్చు. అసెస్మెంట్ ఇయర్ ముగిసే సమయానికి మూడు నెలల ముందుగానే ఫైల్ చేయవచ్చు. అంటే డిసెంబర్ 31 వరకు గడువు ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరం 2023-24 (అసెస్మెంట్ ఇయర్ 2024-25)కి సంబంధించి బిలేటెడ్ రిటర్న్ ఫైల్ చేయవచ్చు. అయితే, సెక్షన్ 234ప్రకారం పెనాల్టిలు కట్టాల్సి ఉంటుంది. రూ. 5 లక్షల వార్షిక ఆదాయం దాటిన వారు రూ.5 వేలు కట్టాలి. అదే రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉంటే వారు రూ.1000 ఫైన్ కట్టాల్సి వస్తుంది.దీంతో పాటుగా సెక్షన్ 234ఏ కింద ట్యాక్స్ బకాయిలపై నెలకు 1 శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.అలాగే సెక్షన్ 234బీ కింద వార్షిక సంవత్సరం ముగిసే నాటికి 90 శాతం ట్యాక్స్ చెల్లించకుంటే సైతం 1 శాతం వడ్డీ పడుతుంది. సెక్షన్ 234సీ ప్రకారం అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు చేయకుంటే బకాయిలపై 1 శాతం వడ్డీ పడుతుంది. వీటన్నింటిని చెల్లిస్తూ బిలేటెడ్ ఐటీఆర్ ఫైల్ చేయవచ్చు. అందుకు గడువు డిసెంబర్ 31 వరకు ఉంటుంది. ఆ తర్వాత సైతం చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. కొన్నిసార్లు జైలుకు సైతం వెళ్లాల్సి వస్తుంది.

**బిలేటెడ్ ఐటీఆర్ ఫైలింగ్ ప్రాసెస్..**

ముందుగా ఇన్‌కమ్ ట్యాక్స్ ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్లోకి మీ వివరాలతో లాగిన్ కావాలి.ఇ-ఫైల్ పై క్లిక్ చేసి ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఎంచుకోవాలి. ఆ తర్వాత ఫైల్ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఎంపిక చేసుకోవాలి.ఆ తర్వాత మీరు ఏ సంవత్సరానికి బిలేటెడ్ ఐటీఆర్ ఫైల్ చేయాలనుకుంటున్నారో ఎంచుకోవాలి.మీ ఆదాయం ప్రకారం సంబంధిత ఇన్‌కమ్ ట్యాక్స్ ఫామ్ ఎంచుకోవాలి.పర్సనల్ ఇన్ఫర్మేషన్ సెక్షన్లో మీ వివరాలు ఇవ్వాలి.సెక్షన్ 139(4) లో బిలేటెడ్ రిటర్న్ ఆప్షన్ సెలెక్ట్ చేయాలి. మీ ఆదాయ వివరాలు అందించాలి.

ఏదైనా ట్యాక్స్ పేమెంట్స్ పెండింగ్‌లో ఉంటే చెల్లించాలి.మీ రిటర్న్ ఎలక్ట్రానిక్ విధానంలో వెరిఫై చేసి ఫైలింగ్ ప్రాసెస్ పూర్తి చేయాలి.

## ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన ఆలయ ఫౌండేషన్



**ధర్మారం డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** ధర్మారం మండల కేంద్రంలో ఈరోజు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ నిర్మించిన ఆలయ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని హాస్పిటల్ ఇన్చార్జి పరికిపండ్ల రామ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేష్ బాబు మాట్లాడుతూ శిబిరం ద్వారా 300 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారని 150 మంది వరకు కంటి సమస్యలు ఉన్న వారిని హైదరాబాద్ నర్సింగ్ లోని శంకర్ ఐ విజన్ సెంటర్కు పంపడం జరుగుతుందని మిగతావారు 9 6 5 2 0 3 4 5 0 0. ఈ చరవాని నెంబర్ ద్వారా తమ సమస్యలను వివరించి ఈ ఫౌండేషన్ ద్వారా చికిత్స తీసుకోగలరని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో టీచర్ రమేష్ బాబు అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్ డిప్యూటీ సీఈవో కీర్తి నాగార్జున హాస్పిటల్ ఇన్చార్జ్ పరికిపండ్ల రామ్ ధర్మారం ఇంచార్జ్ మామిడి శెట్టి శ్రీనివాస్ వెలగటూర్ ఇన్చార్జ్ గోపతి జనార్ధన్ మంచిర్యాల ఇన్చార్జ్ మంగల మహేష్ సీనియర్ వాలంటీర్లు తిరుపతి మహేష్ సాయ వేణి సతీష్ జూనియర్ కళాశాల సాధన ప్రిన్సిపాల్ గాజున వేణి కుమార్ వైస్ ప్రిన్సిపాల్ ఉష్కమల్ల నారాయణ హాస్పిటల్ డాక్టర్లు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



**ధర్మారం డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** ఈరోజు లయన్స్ క్లబ్ ఆఫ్ ధర్మారం అధ్యక్షులు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యంలో ధర్మారం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య మహిళా కార్మికులు 15 మంది కి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. శీతాకాలం దృష్ట్యా ఉదయం పూటే పారిశుద్ధ్య సేవలో నిమగ్నమయ్యే మహిళ పారిశుద్ధ్య కార్మికులను దృష్టిలో ఉంచుకొని అందించడం జరిగిందని అధ్యక్షులు రవీందర్ శెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ తన్నీరు రాజేందర్, జోన్ చైర్మన్ డాక్టర్ కామణి శ్రీనివాస్, డిస్టిక్ చీఫ్ కోఆర్డినేటర్ సామ ఎల్లారెడ్డి, ట్రెజరర్ కట్ట రమేష్, వైస్ ప్రెసిడెంట్ 1 తిప్ప మల్లేశం, లయన్స్ క్లబ్ సభ్యులు ఈగం ప్రసాద్, ఉప్పలంచ దయ నందు, అక్కినపల్లి చంద్రయ్య, భద్ర మహిపాల్, కొత్త మనోహర్ పాల్గొన్నారు.

## మొగిలయ్య మృతి పట్ల సంతాపం

### -సినీ అభిమాన సంఘాల ఐక్యవేదిక జిల్లా చైర్మన్-గుండేటి రాజేష్



**8ఇంక్లైన్ కాలనీ, డిసెంబర్ 19, నినాదం న్యూస్:** తెలంగాణ జానపద కళాకారుడు పస్తం మొగిలయ్య మృతి పట్ల సినీ అభిమాన సంఘాల ఐక్యవేదిక తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాము. బేడ బుడగ జంగాల జానపద కళారూపం 'శారద కథల'కు బహుళ ప్రాచుర్యం కల్పించి, ఆ కళకే గొప్ప బలగంగా నిలిచిన మొగిలయ్య మరణం బడుగుల సంగీత సాహిత్య రంగానికి తీరని లోటు జిల్లా చైర్మన్ గుండేటి రాజేష్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య శారద తంబుర మీటుతూ, పక్కనే బుర్ర (డక్కీ) వాయిస్తూ వారి సతీమణి కొమురమ్మ పలు చోట్ల ఇచ్చిన అనేక ప్రదర్శనలు వెలకట్టలేనివని, తెలంగాణ ఆత్మను ఒడిసిపట్టిన "బలగం" సినిమా చివర్లో వచ్చే మొగిలయ్య పాట ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఈ బాధాకర సమయంలో పస్తం మొగిలయ్య సతీమణి కొమురమ్మ తో పాటు వారి కుటుంబ సభ్యులకు రాజేష్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## స్కూల్ పిల్లలకు యూనిఫాంలు అందించిన కౌన్సిలర్ అంజమ్మ



**నినాదం రూరల్,డిసెంబర్ 19(నినాదం న్యూస్):** పెద్దపల్లి పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ బెక్కం అంజమ్మ స్థానిక బండారికుంట 19 వార్డ్ లోని అంగన్ వాడీ స్కూల్ పిల్లలకు యూనిఫాంలు కౌన్సి లర్ కుమారుడు బెక్కం ప్రశాం త్తో కలిసి గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ స్కూల్ టీచర్,ఆయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నినాదం.. క్లిక్ క్లిక్..



పెద్దపల్లి పట్టణంలో ఓ ఆవు రెండు దూడలకు జన్మనిచ్చింది. అరుదుగా జరిగే ఈ సంఘటన పట్టణంలోని గణపతి రాజేష్ అనే రైతు ఇంట్లో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. తాము ఎంతో ప్రేమగా చూసుకునే ఆవు రెండు దూడలకు జన్మనివ్వడం ఎంతో ఆనందంగా ఉందంటూ ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది.

తంగళ్ళపల్లి మధుసూదన్. -పెద్దపల్లి, నినాదం న్యూస్:

## ఉత్సాహంగా సీఎం కప్ జిల్లా స్థాయి జూడో, రెజ్లింగ్ పోటీలు



**సుల్తానాబాద్, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** పెద్దపల్లి జిల్లా క్రీడా,జూడో, రెజ్లింగ్ క్రీడా సంఘాల ఆధ్వ ర్యంలో గురువారం సుల్తానా బాద్ లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సీఎం కప్ 20 24 జిల్లా స్థాయి జూడో, రెజ్లింగ్ ఎంపిక పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీ లను సుల్తానాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు ,జిల్లా క్రీడా శాఖ అధికారి ఎస్ సురేష్, జిల్లా వాలీ బాల్ సంఘం, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల రవీందర్, ఇండియన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్, పెద్దపల్లి జిల్లా జూడో సంగం అధ్యక్షులు మాటే టి సంజీవ్ కుమార్,ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కొమురో జు శ్రీను వాస్,పెద్దపల్లి జిల్లా పేటా సంగం అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సురేందర్ ,దాసరి రమేష్, పెద్దపెల్లి జిల్లా జూడో,రెజ్లింగ్ క్రీడా సంఘాల కార్య దర్శులు సిలివేరి మహేందర్ వంశీ,ఫిజికల్ డైరెక్ట ర్లు కదారి రవి,ఇండియన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ,పెద్దపల్లి జిల్లా జూడో సంగం ప్రతినిధు లు అడ్డగుంటరాజేందర్ గౌడ్,మంద శ్రీనివాస్ గౌడ్ లతో పాటు వివిధ మండలాల నుంచి వచ్చిన రె జ్లింగ్ జూడో క్రీడాకారులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ బాగుంటుంది

- పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ వేణు
- అట్టహాసంగా ప్రారంభమైన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు





**సుల్తానాబాద్, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** క్రీడల్లో రాణిస్తే క్రీడాకారుల భవిష్యత్ బాగుంటుం దని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణు విద్యార్థులకు సూచించారు. గురువారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశా ల మైదానంలో సీఎం కప్ కబడ్డీ,వాలీబాల్ ఖోఖో పోటీలు డి వై ఎస్ ఓసురేష్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షు లు ము త్యాల రవీందర్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణు,జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన,మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు,మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రా వులు హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడాకారులు గెలుపోటములను స మానం గా తీసుకోవాలని,క్రీడాకారులకు తెలంగా ణ రాష్ట్రంలోఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. సుల్తానాబాద్ క్రీడలకు పుట్టినిల్లుఅని ఇక్కడ నుం చి ఆడే క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థా యిలో ఉన్నారని, అదేవిధంగా సుల్తానాబాద్ లో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తారని, ఈ పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే సీఎం కప్ క్రీడా పోటీలు3 రోజులపాటు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని క్రీ డాకారులకు అన్ని వసతులను కల్పించారని అ న్నారు. క్రీడాకారులుతమనైపుణ్యాన్ని ప్రదర్శించి , రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ బిరుదు సమతా కృష్ణ ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి కొమ్రోజు శ్రీనివాస్, పే ట అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సురేందర్,దాస రి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, ప్రణ య్, సంధ్య, లక్ష్మణ్, ఆసియా, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్,సీనియర్ క్రీడాకా రులు భైరగోని రవీందర్, ముస్తఫా, సంపత్, సత్యం ,ఇక్బాల్,శివ,ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల బాధ్యతను పెంచేందుకే సన్మానం

- జలమండలి ఉన్నతశ్రేణి ఉద్యోగులకు జాతీయ బీసీ సంఘంతో సన్మానం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమాన్



**పెద్దపల్లి,డిసెంబర్19(నినాదం న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వచ్చిన హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ విభాగానికి చెందిన ఉన్నతశ్రేణి అధికార యంత్రాంగానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ స్వాగతించి జిల్లా కేంద్రంలో సన్మానించారు. పెద్దపల్లి జిల్లాలో అధికారిక పర్యటన నిమిత్తం వచ్చిన జనరల్ మేనేజర్ క్వాలిటీ కంట్రోల్ డివిజన్ లో పనిచేస్తున్న ఏ.ఎస్. రమేష్ తో పాటు కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో పనిచేస్తున్న అడిషనల్ చీఫ్ ఇంజనీర్ ఎం.కె.జా మరియు డీజీఎం జలమండలి అబ్దుల్ సత్తార్ ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ బుధవారం రాత్రి శాలువాలతో సత్కరించి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ నగర ప్రజలకు మంచినీటి సరఫరా జరుగుతుందని అంతర్గత పైపులైను పరిశీలన నిమిత్తం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పర్యటించారు. తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక సామాజిక ఉద్యమాలలో సంబంధం కలిగిన ఏ.ఎస్.రమేష్ జలమండలి జనరల్ మేనేజర్ ను సన్మానించడం నాకు సంతోషం ఉందని శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు స్వచ్ఛమైన పరిశుభ్రమైన మంచినీరు సరఫరాకు తోడ్పాటు అందిస్తూ ఉద్యోగ నిర్వహణలో ఈ ప్రాంతానికి రావడం తో సంబంధిత ఉద్యోగులను సన్మానించినట్లు శ్రీమన్నారాయణ తెలిపారు. కర్తవ్యం నిర్వహణలో పెద్దపల్లికి వచ్చిన ప్రభుత్వ యంత్రాంగాన్ని సన్మానించడం వల్ల అటు ప్రభుత్వానికి ప్రజలకు వారి సహకారాలు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు ఈ సన్మాన కార్యక్రమంలో జాతీయ బిసి యువజన సంఘ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్,జాతీయ బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి సత్యనారాయణ,పెద్దపల్లి బీసీ సంఘం నాయకులు గొల్లపల్లి రమేష్,తాడూరు వివేక్,తిరుపతి,ఎమ్ఐ రహీం,శివ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



**పెద్దపల్లి,డిసెంబర్ 19(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని,గతంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీ అమలు నెరవేర్చాలని అన్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం,మండల అధ్యక్షులు పర్స సమ్మయ్య,బిజెపి సీనియర్ నాయకులు రాంసింగ్,అక్కేపల్లి క్రాంతి కుమార్,శివంగారి సతీష్,బెజ్జంకి దిలీప్,రాజవీర్, ఎం.డి.ఫహీం, సందీప్, మనోహర్,జగన్,ముత్యాల సంతోష్ ల తో పాటు రాష్ట్ర నాయకులు కుంభాల సుధాకర్,కేజిబివి రాష్ట్ర నాయకులు రాజ్ కుమార్,పెద్దపల్లి మండల అధ్యక్షుడు సుందరగిరి శ్రీనివాస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు,పాల్గొన్నారు.

## హార్ట్ బీట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంగీత విభావరి




**పెద్దపల్లి,డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** హార్ట్ బీట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో హార్ట్ బీట్ ఫౌండేషన్ ఫర్ ది విజువల్లీ ఇంపైర్డ్, హైదరాబాద్ వారిచే సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని అవయవాలు ఉండి కూడా జీవితంలో ఏమీ సాధించలేని వారికన్నా,చూపు లేకున్నా ఆత్మవిశ్వాసంతో తమ కళను సాకారం చేసుకునే దిశగా సాధన చేసి తమ అద్భుతమైన గాత్రంతో పాటలు పాడడం, మిమిక్రీ చేయడం, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విషయాలు చెప్పడం నిజంగా అభినందనీయమన్నారు. స్వయంగా అంధుడైన నిర్వాహకులు కేవలం తన కోసమే ఆలోచించకుండా, ఇతరులపై ఆధారపడకుండా ఎంతో మంది అంధులకు సహాయం చేస్తూ వారి జీవితాలకు వెలుగును ఇచ్చే దిశగా కృషి చేస్తున్న హార్ట్ బీట్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి సంస్థకు చేయూతగా మన పాఠశాల విద్యార్థులు కూడా తమకు తోచినంతగా విరాళాలు సేకరించి వారికి అందించాల్సిందిగా విద్యార్థినీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ విభావరిలో గాయనీ గాయకులు పాడిన పలు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. పిల్లలంతా చప్పట్లతో గాయకులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్,ఉపాధ్యాయ బృందం, ఫౌండేషన్ నిర్వాహకులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి అమిత్ షాను

## మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి





**మంథని టౌన్ డిసెంబర్ 19 (నినాదంన్యూస్ )** పార్లమెంట్ సమావేశాల్లో భారత రాజ్యాంగాన్నిరచించినటువంటి బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమీషాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని యావత్ భారతదేశంలోని ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీల ప్రజలకు క్షమాపణ చెప్పాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం మంథని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికిపాలాభిషేకంచేసిపూల మాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు దిక్సూచి లాగా రాజ్యాంగ రచన చేసి న అంబేద్కర్ ని నిండు పార్లమెంట్ లో అవమాన పరిచే విధంగా మాట్లాడడం అమిత్ షాఅహంకారానికినిదర్శనంఅనిఅన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజాప్రతినిధిగా ఎన్నికైన అమిత్ షా ప్రజాస్వామ్య దేశంగా రాజ్యాంగ పీఠికను అందించిన అంబేద్కర్ ని అవమానించడం అంటే యావత్ దేశ ప్రజలను అవమానించి నట్టేనని వారు పేర్కొన్నారు. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కేంద్ర హోం శాఖ మంత్రి అమిషాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాలనాయకులు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, కాంగ్రెస్ పార్టీనాయకులు బూడిద తిరుపతి,బెజ్జంకిదిగంబర్,మంథనిశ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యల మొండి,ప్రజాసంఘాల నాయకులు వేల్పుల సురేష్, విరుగురాల ప్రసాద్ బాబు ,రవి,బడికల నరసయ్య,కన్నూరి రవి, డివైఎఫ్ఐ జిల్లాఉపాధ్యక్షులు గొర్రింకల సురేష్,ఆర్లసది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థిని



**సుల్తానాబాద్, డిసెంబర్ 19 (నినాదం న్యూస్) :** పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఐ పిఎస్ పాఠశాలలో గురువారం నిర్వహించిన టే బుల్ టెన్నిస్ పోటీలలో ప్రతిభ కనబరిచి ఈనెల 28, 29, 30 తేదీలలో హైదరాబాదులో జరగను న్న రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థిని దాసోహం ఆరాధ్య ను ప్రిన్సి పాల్ ఫాదర్ శౌరెడ్డి అభినందించారు. ఈ సంద ర్భంగా సెయింట్ మేరీస్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఫా దర్ శౌరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పా టు క్రీడారంగంలో ముందుండి విజయాలను సాధి స్తూ ,భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్యార్థులు సాధించే విజయాలకు సెయింట్ మే రీస్ హై స్కూల్ యాజమాన్యం గర్విస్తుందని టేబు ల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని దాసోహం ఆరాధ్యను అభినందించారు.

## జిల్లాస్థాయి లాన్ టెన్నిస్ ఎంపిక పోటీలు



**మంథని టౌన్ డిసెంబర్ 19 (నినాదం న్యూస్ ):** సీఎం కప్ లో భాగంగా మంథని పట్టణం లోని ప్రభుత్వజూనియర్ కళాశాల లాన్ టెన్నిస్ గ్రౌండ్లో ఎస్ జి ఎఫ్ పెద్దపెల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ కొమురోజ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి లాన్ టెన్నిస్ పోటీలలో సుంకరి జగదీశ్వర్ గోల్డ్ మెడల్ తో మొదటి స్థానంలో, విజయ్ కుమార్ రెండోస్థానంలో,పోలు రామకృష్ణ మూడవ స్థానంలో తీగల నరేష్ నాల్గవస్థానంలో, పోతరవేన వినోద్ ఐదవ స్థానంలో నిలిచి ఈనెల 27నుండి ఎల్బీ స్టేడియంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ లాన్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్ జి ఎఫ్ పెద్దపెల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ కొమురోజ్ శ్రీనివాస్ తెలిపారు.

## భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి




**మంథని డిసెంబర్ 19( నినాదం న్యూస్):** ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో నద్ది నాలా భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, మాజీ ఎంపిపి జక్కుల ముత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ముక్తారం తహశీల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో నదినాలా భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని, దీనిపై ఆర్డీఓకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఆర్టీఓ ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని, 2022లో గ్రామ నర్సరీని అక్కడ ఏర్పాటు చేశారని, ఇంకా స్థలం మిగలడంతో స్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్, వ ల్లె ప్రకృతి వనంకు కేటాయించారని, అయినప్పటికీ ఈ భూమిని గ్రామానికి సంబంధించిన కొంత మంది వ్యక్తులు మరలా ఆ కమించారని తెలిపారు. దీనిపై పలుమార్లు తహశీల్దారు, ఆర్టీఓకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. అంతేగాకుండా పోతారం ( గ్రామ పంచాయతీకి సంబంధించి ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 59 నేషనల్ హైవేకు సంబంధించి భూమి కబ్జాకు గురైందని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నిరసనలో మాజీ వైస్ ఎంపిపి సుదాటి రవీందర్ రావు, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనె కుమార్, దరియాపూర్ మాజీ సర్పంచ్ గాదం స్రవంతి శ్రీనివాస్, బిఆర్ఎస్ ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు అలువోజు రవీందర్, నాయకులు తిత్తుల శ్రీనివాస్, రామగళ్ల మధు, తాత బాలు, రవీం దర్, మల్యాల రాజయ్య, మల్యాల శంకర్ తదితరులున్నారు.

### విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు

## ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు

**కొల్చారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ కాలేజ్ కలెక్టర్ ఆకస్మిక పరిశీలన**



**మెదక్ జిల్లా ప్రతినిధి 19 డిసెంబర్(నినాదం న్యూస్):** విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల మరియు కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, విద్యార్థుల మెనూ, డైనింగ్ హాల్ డార్మెంటరీ, స్టోర్ రూమ్ సంబంధిత వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులు కలిగించి ఉత్తమ విద్యా బోధన అందించాలని, నూతన మెనూ సక్రమంగా అమలు చేయాలని, మెనూ తయారు చేసే విధానంలో నైపుణ్యత సంపాదించుకునేలా వంట మాస్టర్లకు అవగాహన అవసరమని చెప్పారు. వంట వండడం వడ్డించడం అనే విధానాలు మార్పులు కనపడాలన్నారు మెనూ అమలపరిచే విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పు అని హెచ్చరించారు విద్యార్థి నిలఉన్నత చదువులు చదివి రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలకళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



## పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే నిర్వహణ

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష



**పెద్దపల్లి, డిసెంబర్19 (నినాదం):** ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా జిల్లాలో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల సర్వే పకడ్బం దీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష అన్నా రు. గురువారం పెద్దపల్లి పట్టణం అమర్ నగర్ కూడలిలో 35వ వార్డులో జరుగు తున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ. హర్ష మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే పై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోని సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్ లతో సహకరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్‌లు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయా లని, సకాలంలో సర్వే పూర్తి చేసేందుకు అవసరమైతే అదనపు లాగిన్లు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ప్రతి దరఖాస్తు ద్వారానే ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితి గతి తెలిసేలా ఫోటో యాప్‌లో అప్లోడ్ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రావడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ యాప్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం జరిపిస్తున్న మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం క్షేత్రస్థా యిలో పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇంది రమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్, వారికి సూచనలు చేశారు. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు, సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ మార్గ దర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయా లని సూచించారు. ఈ నెలాఖరులోగా ప్రణాళి కాబద్ధంగా సర్వే పూర్తి చేయాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న దృష్ట్యా, దరఖాస్తుదారుల వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపాలిటీ పరిధిలోని వారు వార్డు అధికారిని, గ్రామాల్లో ఉండే వారు పంచాయతీ కార్యదర్శిని సంప్ర దించవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. అనంతరం పెంజర్ల గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రమును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ సగటున ఎంతమంది రోగులు వస్తున్నారు. గ్రామంలోని గర్భిణిలకు సరైన మందులు, పరీక్షలు నిర్వహి స్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి పదిహేను మంది మహిళలో ఒకరికి అబార్షన్ అవుతున్నందున దీనిపై సమగ్ర నివేది క ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల అబార్షన్ జరిగిన మేఘన అనే మహిళతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అబార్షన్‌లు జరగకుండా తగిన వైద్యం అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అధిక మొత్తంలో ప్రసవాల జరిగేలా చూడాలని డాక్టర్, సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బం దితోపాటు పేషెంట్లకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది విధులకు సరైన సమయానికి హాజరు కావాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. టెస్టులు నిర్వహించి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రోగులకుఅందిస్తున్న మందులను పరిశీలించారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం - నియోజకవర్గం ఇంచార్జ్ వొడితల ప్రణవ్**



**జమ్మికుంట, డిసెంబర్ 19 (నినాదం న్యూస్):** హుజురాబాద్ డివిజన్ పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు రైతులకు అందిస్తా మని, కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని, రైతులను అన్ని విధాలా ఆదు కుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ ఒక ప్రకటనలో తెలి పారు. ఈ మేరకు ఎస్సారెస్పీ పరిధిలో ఉన్నటువంటి రైతులకు జనవరి ఒకటి నుంచి సాగునీరు విడుదల చేస్తామని దానికి సంబంధి చిన ప్రణాళికలను అధికారులు రూపొందించారని, ఈ విషయమై ఇప్పటికే అధికారులతో మాట్లా డమని, రైతులకు సాగునీరు కొరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని రైతు సంక్షేమం కోసం మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ కూడా ప్రభుత్వం ఇచ్చిందని ఈ సందర్భంగా ప్రణవ్ గుర్తు చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని రైతు కంటనీరు పెడితే రాష్ట్రా నికి అరిష్టమని ఆయన తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వ అన్ని ఏర్పాట్లు చేస్తుందని రైతులకు సమస్య లేకుండా చూడాలని ఇప్పటికే అధికారులను ఆదేశిం చారని ఆయన తెలిపారు. చివరి ఆయ కట్టు వరకు నీరు అందించి పంటలను కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని రైతులు ధైర్యంగా తమ వ్యవసాయ పనులు చేసుకో వాలని ప్రణవ్ సూచించారు. కొంతమంది రైతులను తప్పుదోవ పట్టించి వారిని ఆగం చేస్తున్నారని అలాంటి వారి మాటలు నమ్మి రైతులు మోస పోకూడదని ఆయన గుర్తు చేశారు.

## నినాదం ఎఫెక్ట్ — ఓపెన్ జిమ్ పరికరాలు మరమ్మత్తులు


**నినాదం వార్తకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్...**



**సుల్తానాబాద్, డిసెంబర్ 19 (నినాదం న్యూస్): ఓపెన్ జిమ్‌లు.... నిర్వహణ శూన్యం** అనే శీర్షిక ఈ నెల16న నినాదం దిన పత్రికలో ప్రచురితం అయిన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ స్పందించారు. సుల్తా నాబాద్


ఓపెన్ జిమ్‌లు... నిర్వహణ శూన్యం
నినాదం

మండల కేంద్రంలోని పూసాల రోడ్, ప్రభుత్వ జూనియర్ కళా శాల మైదానంలోని ఓపెన్ జిమ్‌లను మున్సి పల్ సిబ్బంది మరమ్మత్తులు చేశారు. ఓపెన్ జిమ్ పరికరాలకు కొత్త బేరింగులు బిగించి, గ్రీసింగ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆ కుల వెంకటేష్ ప్రత్యేక చొరవ చూపి సమస్య పరిష్కరించారు.



## థియేటర్లలోనే ఇండియన్-3

కమల్‌హాసన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ భారతీయుడు. శంకర్ దర్శకత్వంలో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ ఫ్రాంఛైజీలో ఇప్పటికే ఇండియన్ కూడా వచ్చిందని తెలిసిందే. ఈ ఏడాది జులై 12న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. వాయిదాల మీద వాయిదాలు పడి విడుదలైన సీక్వెల్ నిర్మాతలకు నష్టాలనే మిగిల్చడంతో ఇక మూడో పార్ట్ ఇండియన్ 3ని థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో విడుదల కానుందంటూ ఇప్పటికే నెట్టింట వార్తలు రౌండప్ చేస్తున్నాయి. ఇండియన్ 2 అలాంటి నెగెటివ్ రివ్యూస్ వస్తాయని అస్సలు ఊహించలేదు. సరేనంటూ ముందుకెళ్లాను. నేను నా వర్క్‌ను నమ్ముతా. అదేంటో గేమ్ ఛేంజర్, ఇండియన్ 3 సినిమాలే చెబుతాయి. ఈ రెండు సినిమాలు తప్పకుండా థియేటర్లలో ఎంజాయ్ చేసే విధంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశాడు. అంతేకాదు ఇండియన్ 3 థియేటర్లలో విడుదల కానుందని క్లారిటీ ఇచ్చేశాడు. దీంతో కమల్ హాసన్ అభిమానులు ఎక్జయిటింగ్‌కు లోన వుతున్నారు.

తాజా టాక్ ప్రకారం గేమ్ ఛేంజర్ విడుదలైన తర్వాత ఇండియన్ 3 ప్రమో షన్స్ కూడా షురూ చేయబో తుందట శంకర్ టీం. అంతేకాదు ట్రైలర్ కూడా త్వరలోనే థియేటర్లలో సందడి చేయబోతుం దని ఇన్‌సైడ్ టాక్. ఇంకేంటి మరి తక్కువ టైంలోనే శంకర్ అభిమా నుల కోసం రెండు సినిమాలు రాబోతున్నాయన్న మాట.

## ఆకట్టుకుంటున్న వెంకీ సాంగ్



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ కాంపౌండ్ నుంచి రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంక్రాంతికి వస్తున్నాం. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన మీను సాంగ్ ప్రోమో నెట్టింట చక్కర్లు కొడుతుండగా.. తాజాగా మేకర్స్ ఫుల్ లిరికల్ వీడియో సాంగ్‌ను లాంచ్ చేశారు. అనంత్ శ్రీరామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో, ప్రణవి ఆచార్య పాడారు. మీనాక్షి చౌదరి వెంకీను ఫాలో అవుతూ సాగే ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. వెంకీ నుంచి అభిమానులు కోరుకునే ఎలిమెంట్స్‌తో సాగుతున్న ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలువబోతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు. మేకర్స్ ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. ఓ.. గోరింటాకెట్టుకున్న సందమామవే సాంగ్ లాంచ్ చేయగా.. మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ దూసుకెళ్తోంది. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. ఈ మూవీలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.

## అలాంటి అబ్బాయి కావాలి : రష్మిక



అగ్ర కథానాయిక రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'పుష్ప-2' విజయోత్సాహంలో ఉన్న ఈ భామ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తన లైఫ్‌లోకి రాబోయే భాగస్వామి ఎలా ఉండాలో వివరించింది. జీవితంలోని ప్రతీ మలుపులో అతను తోడుండాలని, కష్టసమయంలో అండగా నిలబడాలని, అన్ని వేళల్లో భద్రతనివ్వాలని చెప్పింది. రష్మిక మందన్న మాట్లాడుతూ 'స్త్రీ పురుష సంబంధాల్లో పరస్పర గౌరవం, నమ్మకం చాలా ముఖ్యమైన అంశాలు. ఒకరిపట్ల ఒకరికి గౌరవం ఉంటే జీవితాంతం కలిసి ఉండొచ్చు. కోపతాపాలకు దూరంగా అర్థం చేసుకునే సహృదయత కలిగి ఉండాలి. అలాంటి అబ్బాయే కావాలనుకుంటున్నా' అని చెప్పింది. జీవితానికి తప్పకుండా ఓ తోడు అవసరమని, మన కష్టాలను పంచుకునే వారు లేని జీవితాన్ని ఊహించలేమని రష్మిక మందన్న అభిప్రాయ పడింది. ప్రస్తుతం ఆమె 'ది గర్ల్‌ఫ్రెండ్' 'రెయిన్‌బో' 'సికందర్' 'ఛావా' 'కుబేర' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## ట్రిపుల్‌ఆర్ డాక్యుమెంటరీకి అడ్వాన్స్ ఓపెన్



దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్ఆర్ఆర్. అగ్ర కథానా యకులు ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్ర లో నటించగా బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ కథానాయికగా నటించింది. డీవీవీ ఎంటర్ టైనమెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రం ఈ సినిమా 2021లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకో వడమే కాకుండా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ సినిమా మేకింగ్ వీడియోను డాక్యుమెంటరీ రూపంలో తీసుకు రాబోతు న్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఆర్ఆర్ఆర్- బిహైండ్ అండ్ బియాండ్'అంటూ రాబోతున్న ఈ డాక్యు మెంటరీ డిసెంబర్ 20న నేరుగా ఎంపిక చేసిన మల్టీప్లెక్స్ స్క్రీన్‌లలో విడుదల కానుంది. అయితే ఇప్ప టికే ఈ డాక్యుమెం టరీకి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా.. మంచి వ్యూస్ దక్కించుకుంది. అయితే రేపు ఈ డాక్యుమెంటరీ విడుదల కానుండగా.. బుక్ మై షోలో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయినట్లు చిత్రబృందం ప్రకటించింది. వీటి టికెట్ ధరలు చూసుకుంటే.. రూ.200 నుంచి రూ.300 వరకూ ఉన్నాయి. మరోవైపు ఈ డాక్యుమెంటరీ రన్ టైం 1 గంట 38 నిమిషాలు ఉంది.

## కీర్తిసురేష్ దంపతులతో విజయ్ దళపతి

నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి కీర్తిసురేశ్ -ఇటీవలే ఆంథోని తటిల్‌తో వివాహబంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఆంథోని తటిల్ హిందూ సంప్రదాయ పద్ధతిలో కీర్తిసురేశ్ మెడలో మూడు ముళ్లు వేశాడు. ఆ తర్వాత క్రిస్టియన్ సంప్రదాయంలో కూడా పెళ్లి చేసుకున్నారు. కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన కీర్తిసురేశ్ దంపతులకు ఇండస్ట్రీ ప్రముఖులు, స్నేహితులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. తాజాగా స్టార్ హీరో నవ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఫొటోలతోపాటు వెడ్డింగ్ గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతోంది. సంప్రదాయ వస్త్రధారణలో వధూవరులిద్దరు కలర్‌ఫుల్‌గా మెరిసిపోతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో తో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ నటుడు వరుణ్ ధవన్‌తో కలిసి కీర్తిసురేశ్ నటిస్తోన్న బేబిజాన్ సినిమా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. బేబిజాన్ కీర్తిసురేశ్‌కు హిందీలో తొలి సినిమా.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741